మంగళవారం
16-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 25
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫ్రాన్స్‌లో నేషనల్ డే

పారిస్: రాజకీయ అనిశ్చితి వేళ ఫ్రాన్స్‌లో నేషనల్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సైనిక విజయాలను ఫ్రాన్స్ వేడుక చేసుకుంది. 80 ఏళ్ల కిందట జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఫ్రాన్స్, అనుబంధ యూనిట్లను దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పర్యవేక్షించారు. బాస్టిల్లే డే పరేడ్‌లో పాల్గొన్నారు. గతేడాది భారత ప్రధాని నరేంద్రమోదీ విదేశీ అతిథిగా పాల్గొని ఫ్రాన్స్ సైనిక పరేడ్‌ను వీక్షించారు. ఈ ఏడాది విదేశీ అతిథి ఎవరూ లేరు. పరిమిత దళాలతోనే పరేడ్ జరిగింది. సాయుధ వాహనాలు పాల్గొనలేదు.

ఉద్యోగ సంఘాల ఉద్యమ హెచ్చరికతో

జీపీఎస్ జీవో నిలిపివేత

విచారణకు చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) అమలు చేస్తూ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జీవో విడుదలలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ జీవోను తాత్కాలికంగా నిలిపివేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఊరట చెందాయి. అంతకముందు ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరించాయి. సీపీఎస్ ఉద్యోగ సంఘాలు కూడా మీడియా సమావేశానికి సిద్ధమయ్యాయి. దీంతో వివిధ ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేయడంతో జీపీఎస్ జీవోను తాత్కాలికంగా నిలిపివేశారు. జీపీఎస్‌పై గెజిట్ జారీచేయడంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు.

ఇప్పుడు ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందో విచారించాలని ఆర్థికశాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీపీఎస్‌ను ప్రతిపాదించగా...దానిని ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించారు. అనేక దఫాలుగా ప్రభుత్వం, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేసిన చర్చలు ఫలించలేదు. ఎట్టకేలకు జీపీఎస్ తెచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం నిర్ణయించగా...ఈలోగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. జీపీఎస్ అమలుతోపాటు ఉద్యోగులకు సంబంధించి అనేక ఇతర సమస్యలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉద్యోగ సంఘాలన్నీ ఐక్యంగా కూటమికి మద్దతిచ్చాయి. ఇదే విషయాన్ని ఆయా ఉద్యోగ సంఘాలు బహిరంగంగానే చెబుతున్నాయి. దీనిని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గుర్తించకుండా జీపీఎస్

- మిగతా 2 లో

వనరులు దోచేశారు

- 1.75 లక్షల ఎకరాలు కబ్జా
- వీటి విలువ రూ.35 వేల కోట్లు పైనే
- భూ రీసర్వే పేరుతో రాళ్లకు రూ.653 కోట్లు తగలేశారు
- భూ దోపిడీ, అక్రమాలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్
- సహజవనరుల దోపిడీపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని అన్ని రకాల సహజ వనరులను వైసీపీ ప్రభుత్వం దోచేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వ ఉగ్రవాద చర్యలతో ఇష్టానుసారం భూములు, గనులు, ఎర్రచందనం, ఇసుక, అటవీ సంపదనంతా దోచేశారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడీకి పాల్పడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం సహజ వనరుల దోపిడీపై సీఎం శ్వేతపత్రం విడుదల చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచ భూతాలను సైతం మింగేసింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ కుంభకోణం జరిగింది. ఖనిజ సంపద, అడవులను ఇష్టానుసారం ధ్వంసం చేశారు. మాకు అందిన రికార్డుల ప్రకారం దాదాపు రూ.35 వేల కోట్ల విలువైన లక్షా 75 వేల ఎకరాలు కబ్జాకు గురైనట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరు, తిరుపతిలో జరిగిన సహజవనరుల దోపిడీ ఒక కేస్ స్టడీ. ఇళ్ల స్థలాల పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ముందుగానే భూములు గుర్తించి వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి... వాటికి రెండింతలు ధర నిర్ణయించుకుని ప్రభుత్వానికి విక్రయించారు. 26 జిల్లాల్లో వైసీపీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించుకుని ప్యాలెస్‌లు కట్టుకున్నారు. అసైన్డ్ భూములను ఇష్టారీతిన అనర్హులకు కేటాయించుకున్నారు. భూ సర్వే పేరుతో సరిహద్దులు మార్చారు.

వైసీపీ భూ దోపిడీకి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం పరాకాష్ట. భూమ్మీద యజమానికి హక్కులు లేకుండా చేయడానికి ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. ఇళ్ల పట్టాల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 10 వేల ఎకరాలు బలవంతంగా లాక్కున్నారు. వైసీపీ కార్యాలయాలకు భూములు కేటాయించడం కోసం జీవో నెంబర్ 340 తీసుకొచ్చారు. దీని ద్వారా రెండు ఎకరాల చొప్పున 33 ఏళ్లకు లీజుకు ఇచ్చారు. రాష్ట్రం మొత్తంగా రూ.300 కోట్ల విలువ చేసే 40.78 ఎకరాల భూమిని వైసీపీ కార్యాలయాలకు అప్పనంగా కేటాయించుకున్నారు. కనీసం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. రాష్ట్రంలో పేదలకు చెందాల్సిన 8,086 ఎకరాల భూమిని అనర్హులకు కట్టబెట్టారు. భూ రీసర్వే పేరుతో పాసు పుస్తకాలు, సరిహద్దు రాళ్లపై బొమ్మలకు రూ.653 కోట్లు తగలేశారు. శాశ్వత భూ రక్ష చట్టం అని పెట్టి దానిపైన ప్రభుత్వ రాజముద్ర లేకుండా జగన్ ఫొటో వేసుకున్నారు. ఇదంతా అహంభావం...ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని అనుకున్నారు. దాదాపు రూ.13 కోట్లు ఖర్చు పెట్టి పట్టాదారు పుస్తకాలపై ఫొటోలు వేసుకున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు లాక్కున్న భూములను తిరిగి బాధితులకు అప్పగిస్తాం. గుజరాత్ తరహాలో రాష్ట్రంలో ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకువస్తాం. పోలవరం కుడి కాలువను తవ్వి రూ.800 కోట్ల విలువ చేసే మట్టి తరలించారు. పుంగనూరు, చిత్తూరు, పల్నాడు ప్రాంతాల్లో అడవులను పెద్ద ఎత్తున ధ్వంసం చేశారు. కర్నూలు జిల్లాలో బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన రవ్వల కొండను తవ్వేశారు. విశాఖలో రిషికొండ తవ్వేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టారు. ఇది ఎందుకు కట్టారంటే పీఎం, రాష్ట్రపతి వచ్చినప్పుడు ఉండటానికని కబుర్లు చెప్పారు.

వైసీపీ భూ కబ్జాలపై టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

భూ కబ్జాలపై టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తాం. మా దృష్టికి తీసుకొచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి బాధితులకు అప్పగిస్తాం. తప్పు చేసిన వారిని ఎట్టి

- మిగతా 2 లో



రాజ్యసభలో

బీజేపీకి కష్టాలే

- 86కు పడిపోయిన సంఖ్యాబలం
- ఎన్డీయేకు వైసీపీ అవసరం తప్పనిసరి

న్యూఢిల్లీ: కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీకి... రాజ్యసభలో మాత్రం మెజార్టీ తగ్గిపోయింది. నామినేటెడ్ ఎంపీలైన రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేశ్ జెఠ్మలాని పదవీకాలం శనివారంతో ముగియడంతో పెద్దల సభలో బీజేపీ బలం 86కు పడిపోయింది. కేంద్ర ప్రభుత్వ సూచనలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరిని నియమించారు. అనంతరం రాజ్యసభలో అధికార ఎన్డీయే కూటమికి మద్దతుగా నిలిచారు. అయితే నలుగురు ఎంపీల రాజీనామాతో రాజ్యసభలో బీజేపీ సంఖ్య 86కు చేరగా... ఎన్డీయే కూటమికి 101 మంది ఎంపీల బలం ఉంది. మొత్తం 245 సభ్యులు కలిగిన పెద్దల సభలో మెజార్టీ మార్కు 113గా ఉంది. ప్రస్తుతం రాజ్యసభలో 225 మంది ఉన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్యసంఘటనకు 87 మంది సభ్యుల మద్దతు ఉంది. ఇందులో కాంగ్రెస్‌కు 26, తృణమూల్ కాంగ్రెస్‌కు 13, ఆమ్ ఆద్మీపార్టీ 10, డీఎంకే పార్టీకి 10 మంది సభ్యులు ఉన్నారు. వీరితోపాటు అటు ఎన్డీయే, ఇటు ఇండియా ఐక్యసంఘటనలో భాగస్వాములు కాని బీఆర్ఎస్, కొంతమంది నామినేటెట్ ఎంపీలు, స్వతంత్రులు ఉన్నారు. ఎగువ సభలో బిల్లులు ఆమోదించడానికి బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్డీయే యేతర పార్టీలపై ఆధారపడి ఉంది. ఎన్డీయేకు మాజీ మిత్రపక్షాలైన

- మిగతా 2 లో

'ఆధార్' తరహా ద్రవ్య బిల్లుల విచారణకు

ప్రత్యేక రాజ్యాంగ ధర్మాసనం

త్వరలో ఏడుగురు జడ్జిలతో ఏర్పాటు చేస్తాం: సీజేఐ

న్యూఢిల్లీ: ఆధార్ చట్టాన్ని ద్రవ్య బిల్లుగా పార్లమెంటు ఆమోదించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణకు విస్తృత రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. రాజ్యసభలో మెజారిటీ లేని కారణంగా ఆధార్, మనీలాండింగ్ వంటి చట్టాలను ద్రవ్య బిల్లులుగా ప్రవేశపెట్టి, చట్టసభల ఆమోదించేలా మోదీ ప్రభుత్వం చేస్తోంది. ఈ వ్యవహారం రాజకీయంగానే కాకుండా న్యాయపరంగానూ వివాదానికి తెరతీసింది. 245 స్థానాలుండే ఎగువ సభలో మెజారిటీ కావాలంటే 123 మంది ఎంపీలు

- మిగతా 2 లో

కష్టాల సుడిలో 'కౌలు'

- ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి

2లో

కేజ్రీవాల్ ఆరోగ్యంపై

అనుమానాలు

తీహార్ జైలు అధికారుల నివేదిక

పచ్చి అబద్ధమన్న ఆప్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన ఆరోపణలను తీహార్ జైలు ఉన్నతాధికారులు ఖండించారు. ఆయన ఆరోగ్యానికి సంబంధించిన నివేదికను సోమవారం విడుదల చేశారు. వైద్యులు సూచించినట్లుగా... ఇంటి నుంచి వచ్చిన ఆహారం మాత్రమే కేజ్రీవాల్ తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 2వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు కేజ్రీవాల్ రెండు కేజీల బరువు తగ్గారని చెప్పారు. ఆయన బరువుకు

- మిగతా 2 లో

ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయం

- అధికారిక కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులను దూరం పెట్టండి
- ఇష్టానుసారం ప్రవర్తించేవారిపై క్రమశిక్షణా చర్యలు
- జనసేన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సత్కారంలో పవన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రజలు జనసేన మీద పెట్టుకున్న నమ్మకాన్ని ప్రతి ప్రజాప్రతినిధి ఓ గురుతర బాధ్యతగా భావించి పనిచేయాలని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో

- మిగతా 2 లో

గురుకులంలో కలకలం

- అర్ధరాత్రి 135 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత
- వివిధ ఆస్పత్రులకు తరలించి...చికిత్స
- నాయుడుపేటలో ఘటన
- మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశం

విశాలాంధ్ర - నాయుడుపేట: తిరుపతిజిల్లా నాయుడుపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి విద్యార్థులు ఉన్నట్లుండి తీవ్ర అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. ఆహారం తీసుకున్న విద్యార్థులు వరుసబెట్టి 135 మంది వరకు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లో తిన్న ఆహారం కలుషితం కావడంతో తమ పిల్లలు అనారోగ్యం పాలయ్యారని తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే వెంటనే స్పందించిన గురుకుల పాఠశాల సిబ్బంది...సకాలంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గంట గంటకూ అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య పెరగడంతో నాయుడుపేట ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు

- మిగతా 2 లో

కష్టాల సుడిలో 'కౌలు'

- ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి
- దక్కని గిట్టుబాటు ధర
- అప్పుల ఊబిలో అన్నదాత
- జాడలేని సీసీఆర్ కార్డులు

విశాలాంధ్రబ్యూరో–ఏలూరు: కౌలు రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పేలా లేవు. గత ఐదేళ్లుగా అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ఏటా పెరుగుతున్న సాగు పెట్టుబడులతో సతమతమవుతున్నారు. ఇంకోవైపు తెగుళ్ల దెబ్బకు సక్రమంగా పంటలు పండక నష్టపోతున్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటికీ సగం మందికి కూడా కౌలుదారు కార్డులు అందలేదు. ఫలితంగా ప్రభుత్వ రాయితీలు కోల్పోతున్నారు. ఈ ఖరీఫ్ కూ పెట్టుబడికి డబ్బులు లేక బ్యాంకుల నుంచి రుణాలు అందక నానా అగచాట్లు పడుతున్నారు. చేసేదిలేక పెట్టుబడి కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులనుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి నష్టపోతున్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయాన్ని వదిలి ప్రత్యామ్నాయమార్గాల వైపు చూస్తున్నారు. ప్రధానంగా కౌలు రైతులు ఉపాధి కోసం వలసలు పోతున్నారు. కొంతమంది భవన నిర్మాణ కూలీలుగా మారుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2 లక్షల 50 వేల మంది, ఏలూరు జిల్లాలో 1 లక్ష 12 వేల 500 మంది కౌలు రైతులు ఉన్నారు. సాధారణ రైతుల మాదిరిగా రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ, పథకాలు, పంటల నష్టపరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వీరికి సక్రమంగా అందడం లేదు. ఏటా అప్పులు చేసి సాగు

చేస్తున్నా పెట్టుబడి సొమ్ములు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు వచ్చి పంటలకు నష్టం జరిగితే అనేకమంది అప్పుల ఊబిలోకి కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గుర్తింపు కార్డుల మంజూరులో జాప్యం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 70శాతం పంటలను కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పనులు మే నెలాఖరుకు ప్రారంభమయ్యాయి. సొంత భూమి ఉన్న రైతులు ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలకు తోడు ఇప్పటికే వారి ఖాతాలో జమ అయిన రైతు భరోసా సొమ్ముతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ కౌలు రైతుల పరిస్థితే దుర్భరంగా మారింది. వారిని గుర్తించడంలో తీవ్ర ఆలసత్వం చోటు చేసుకుంటోంది. ప్రభుత్వం ఏటా వారికి అందించే సీసీఆర్ (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) పత్రాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. అధికార యంత్రాంగం వాటి జారీ చేసే పనిలో ఉంది. గతంలో ఈ కౌలు పత్రాలు న్న రైతులు కూడా మళ్లీ రెన్యువల్ చేయించుకుంటేనే కార్డు మనుగడలోకి వస్తుంది. సీసీఆర్కార్డు గడువు 11 నెలలలో ముగుస్తుంది. మళ్లీ యజమాని అనుమతితో కార్డు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ను మే నెలాఖరుకు ముగించి ఖరీఫ్ ప్రారంభమయ్యే జూన్ మొదటి వారంలోపే కార్డులను రైతులకు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఆగస్టు, సెప్టెంబర్ వరకు కార్డులు అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ శాఖ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత పత్రాలన్నీ రైతులు సమర్పిస్తే వీఆర్వోల ఆమోదంతో ఈ కార్డులను కౌలు రైతులకు అందజేస్తారు. ఏలూరు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ లో 75వేల సీసీఆర్ కార్డులకు గాను కేవలం 7,222 మాత్రమే మంజూరు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 84,185 సీసీఆర్ కార్డులకు గాను 20 వేల కార్డులే మంజూరయ్యాయి. ఈ ప్రక్రియ అంతా జరిగి రైతులకు కార్డులు అందేసరికి ఆగస్టు ముగిసిపోయే అవకాశం ఉందని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలతో పాటు, అర్హత కలిగిన వారికి రైతు భరోసా సాయం అందించడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. సీసీఆర్ కార్డుల మంజూరుకు భూ యజమానితో ఒప్పంద పత్రం ఉండాలన్న నిబంధనతో లక్ష్యం నెరరడం లేదు. ప్రభుత్వం కౌలు రైతులకు కచ్చితంగా న్యాయం చేయాలనుకుంటే భూ యజమాని ఒప్పంద పత్రం తీసుకునే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సాగును ప్రోత్సహించేలా ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి శాస్త్రీయ ఆధారాలతో వాస్తవ సాగుదారులకు కేటాయించిన రాయితీలు పూర్తిగా చేరితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు స్పందించి కౌలు రైతు రుణాలతో పాటు, ప్రభుత్వ రాయితీ అందజేయాలని కౌలు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భూ యజమానులకు అవగాహన కల్పించాలి

వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు చొరవ తీసుకుని గ్రామాలలో భూ యజమానులకు సీసీఆర్ కార్డులపై అవగాహన కల్పించాలి. కార్డు కౌలుదారికి ఇచ్చినంత మాత్రాన భూమిపై యాజమాన్యపు హక్కులకు భంగం వాటిల్లదని వివరించాలి. కౌలు రైతులకు సైతం కార్డు వల్ల ఉపయోగాలను చెప్పి చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

కేజ్రీవాల్ ఆరోగ్యంపై అనుమానాలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన రోజు వారీ నివేదికను జైలు ఉన్నతాధికారులు విడుదల చేశారు. కేజ్రీవాల్ శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పని చేస్తున్నాయన్నారు. జైల్లోని ఖైదీల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుంటామన్నారు. వైద్యుల సూచనలు, సలహాలు తప్పక పాటిస్తామన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న వాదనలు వాస్తవానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయని జైలు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా వారు చేస్తున్న ఆరోపణల వెనుక నిగూఢ ఉద్దేశాలున్నట్లు స్పష్టమవుతుందన్నారు.

కేజ్రీవాల్ ఆరోగ్యంపై తీహార్ జైలు ఉన్నతాధికారుల స్పందనపై ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ స్పందించారు. జైలు అధికారులు విడుదల చేసిన ఈ నివేదికతో తాము ఏకీభవించడం లేదని ఆయన స్పష్టం చేశారు. కేజ్రీవాల్ ఆరోగ్యంపై జైలు అధికారులు నివేదిక విడుదల చేసి... నేరం చేశారని మండిపడ్డారు. కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వైద్యుల బృందం పరీక్షించిందని ఆయన గుర్తు చేశారు. కేజ్రీవాల్ బాగా బరువు తగ్గారని, అలాగే హైపోగ్లైసీమియాతో బాధపడుతున్నారని వారు చెప్పారన్నారు. కేజ్రీవాల్ షుగర్ స్థాయిలు బాగా తగ్గిపోయాయని, అలా అయిదుసార్లు జరిగిందని వారు చెప్పారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయన మరణపు అంచుల్లోకి వెళ్తారన్నారు. కేజ్రీవాల్ను చంపడానికి కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఆయన అరెస్ట్ అయిన రోజు 70 కేజీల బరువు ఉన్నారన్నారు. ప్రస్తుతం ఆయన 61.5 కేజీల బరువు మాత్రమే ఉన్నారని తెలిపారు. కేజ్రీవాల్ జీవితంతో ఆటలాడుకోవద్దని ప్రధాని మోదీకి హితవు పలికారు. ఆయనకు ఏదైనా జరగరానిది జరిగితే... సమాధానం ఇచ్చేందుకు కేంద్రం ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందని పరోక్షంగా మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆదివారం విలేకరుల సమావేశంలో ఢిల్లీ మంత్రి అతిశీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ను తీహార్ జైల్లో అంతమొందించేందుకు కుట్ర జరుగుతుందన్నారు. ఆయనకు ఏదైనా జరిగితే... అందుకు మోదీ సర్కారుదే బాధ్యత అని స్పష్టం చేశారు. అతిశీతోపాటు వైద్యులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని వారు వివరించారు.

వనరులు దోచేశారు

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను. భూముల రీ సర్వే జరిగిన చోట అవకతవకలు జరిగి ఉంటే సరిచేస్తాం. గతంలో హద్దులకు సంబంధించిన సమస్య ఉంటే వారి ముందే సమస్యలు పరిష్కరించాం. కానీ గత ప్రభుత్వం కేవలం హద్దు రాళ్లపై బొమ్మలు వేసుకోవడానికి మాత్రమే భూ సర్వే తెచ్చారు. ఈ భూ సర్వేను నిలిపేస్తాం. వైసీపీ ప్రభుత్వ దోపిడీపై ప్రజల్లో చర్చ జరగాలి. వైసీపీ తప్పిదాలను ప్రజల ముందు పెట్టి వారి అనుమతితోనే చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు.

జగన్పై నిందలకే శ్వేతపత్రాలు: మేరుగు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డిపై నిందలు మోపేందుకే చంద్రబాబు శ్వేతపత్రాలను విడుదల చేస్తున్నారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. రాష్ట్రంలో కబ్జాలకు పాల్పడిన వారే మళ్లీ నీతులు చెబుతున్నారంటూ మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రం ఆయన హయాంలో జరిగిన దోపిడీలాగా ఉందన్నారు. విశాఖ దసపల్లా భూములు ప్రభుత్వానివి కాదని సుప్రీంకోర్టే చెప్పిందని, అయినా సరే దానిపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేశారని ఖండించారు. టీడీపీ కార్యాలయాన్ని అక్రమిత స్థలంలో నిర్మించారని, గీతం యూనివర్సిటీలో భూములను ఆక్రమించుకుంటే... దానిపై శ్వేతపత్రంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. తమ దగ్గర వాటికి సంబంధించిన అన్ని ఆధారాలున్నాయని వివరించారు. నాగావళి, కృష్ణా, గోదావరిలో ఇసుక దోపిడీకి టీడీపీ నేతలే పాల్పడ్డారని దుయ్యబట్టారు. చంద్రబాబు హయంలోనే ఎన్జీటీ రూ.వంద కోట్లు అపరాధ రుసుం వేసిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశామని గుర్తుచేశారు. వర్షాకాలంలో ఉపయోగపడేలా ఇసుక నిల్వలను ఉంచితే, వాటిని టీడీపీ నేతలు అక్రమంగా విక్రయించుకుంటున్నారని ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందని అది రాష్ట్రానికి సంబంధం లేదన్నారు.

రక్షిత క్షేత్రంలో ఇజ్రాయిల్ దాడులు

90 మంది పలస్తీనియన్లు మృతి-300 మందికి గాయాలు

ఖాన్యూనిస్: హమాస్ మిలటరీ కమాండర్ లక్ష్యంగా దక్షిణ గాజాలో ఇజ్రాయిల్ దళాలు జరిపిన భీకర దాడుల్లో చిన్నారులు సహా 90 మంది చనిపోయారు. మరో 300 మందికి గాయాలయ్యాయి. శిథిలాల కింద అనేకమంది చిక్కుకొని ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అంచనా ఉంది. ఈ మేరకు స్థానిక ఆరోగ్య అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. మహమ్మద్ డెయిఫ్, హమాస్ రెండవ కమాండర్ రఫా సలామా మరణించినట్లు కచ్చితమైన సమాచారం తమకు లేదని వెల్లడించారు. ఆ ప్రాంతంలో డెయిఫ్ ఉన్నారన్న వాదనను హమాస్ తిరస్కరించింది. నరమేధాన్ని కప్పిపుచ్చుకునేందుకు డెయిఫ్ పేరును ఇజ్రాయిల్ వాడుకుంటోందని ఆరోపించింది. పలస్తీనియన్లకు సురక్షిత క్షేత్రంగా ఇజ్రాయిల్ సైన్యం నిర్దేశించిన ప్రాంతంలో తాజా దాడి జరిగింది. కాల్పుల విరమణ చర్చల క్రమంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. డెయిఫ్ మరణంతో ఇజ్రాయిల్కు ఓ పెద్ద విజయం దక్కుతుంది. హమాస్కు గట్టి ఎదురు దెబ్బ తగులుతుంది. హమాస్ను పూర్తిస్థాయిలో నాశనం చేసేంత వరకు యుద్ధాన్ని ఆపేది లేదని, తమ లక్ష్య సాధన దిశగా డెయిఫ్ మరణం పెద్ద మైలురాయి కాగలదని నెతన్యాహు వెల్లడించారు. హమాస్ నేతలందరికీ మరణం తప్పదని, ప్రతి ఒక్కరిని ఏరివేస్తామని ఆయనన్నారు. దాడి జరిగిన ప్రాంతం సమీపంలో బందీలెవరూ లేరన్నారు. ఈ విషయం తనకు కచ్చితంగా ఎలా తెలుసన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. తాజా దాడిలో 90 మంది చనిపోగా 300 మందికి గాయాలయ్యాయని గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. నాసర్ ఆసుపత్రి వద్ద 40కుపైగా మృతదేహాలను లెక్కించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ జర్నలిస్టులు వెల్లడించారు. ఉగ్రవాదులు... పౌరుల ముసుగులో ఉన్నారని ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. తాము దాడి చేసినది శిబిరం కాదని హమాస్ స్థావరమని వెల్లడించింది.

ఇమ్రాన్ పార్టీపై నిషేధం!

పాక్ ప్రభుత్వ కసరత్తు

ఇస్లామాబాద్: పాకిస్థాన్లో రాజకీయ సంక్షోభం కొనసాగుతోంది. మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ)పై నిషేధం విధించేందుకు ఆ దేశ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దేశద్రోహం ఆరోపణలు చేస్తోంది. ఇటీవల కొన్ని కేసుల్లో ఇమ్రాన్ ఖాన్కు, ఆయన పార్టీకి అనుకూలంగా తీర్పులు వెలువడ్డాయి. సుప్రీంకోర్టు తీర్పుతో పార్లమెంటులో మరిన్ని స్థానాలను పొంది... అతిపెద్ద పార్టీగా పీటీఐ ఆవిర్భవించింది. ఇమ్రాన్ ఖాన్ పార్టీపై నిషేధం విధించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తరార్ వెల్లడించారు. ఆయన సోమవారం ఇస్లామాబాద్లో విలేకరులతో మాట్లాడుతూ దీనిపై సుప్రీం కోర్టుకు వెళతామన్నారు. పీటీఐని నిషేధించేందుకు విశ్వసనీయ ఆధారాలు ఉన్నాయని చెప్పారు. అల్లర్లను రెచ్చగొట్టడం, దేశ రహస్యాలను లీక్ చేయడం వంటి చర్యలకు ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాల్పడినట్లు ఆరోపించారు. ఇమ్రాన్ ఖాన్ ఏడాదిగా జైల్లో ఉన్న విషయం తెలిసిందే.

ప్రత్యేక రాజ్యాంగ ధర్మాసనం

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలి. ఎన్డీయే సంఖ్యాబలం 86 మాత్రమే. దీంతో రాజ్యాంగంలోని 110వ అధికరణ నెపంతో చట్టాలను ద్రవ్య బిల్లులుగా ప్రవేశపెడుతోందని ఆరోపణలు ఉన్నాయి. ఇదే అధికరణ కింద ఆధార్ చట్టం–2016ను ద్రవ్య బిల్లుగా ఆమోదించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన వారిలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఉన్నారు. ఈ పిటిషన్లను సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఇప్పటికే ఈ వ్యవహారం రాజ్యాంగ ధర్మాసనం విచారించాల్సిన అంశాలలో ఒకటిగా ఉన్నదని కోర్టుకు గుర్తుచేశారు. ఇందుకోసం సముచిత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సీజేఐ స్పందిస్తూ రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటు చేసేటప్పుడు దీనిని పరిగణిస్తానని చెప్పారు. ఆధార్ చట్టాన్ని ద్రవ్య బిల్లుగా ఆమోదించడంపై విచారణకు ఏడుగురు జడ్జిల విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ద్రవ్య బిల్లు అన్నది లోక్సభలో ప్రవేశపెట్టవచ్చు కానీ దీనిని సవరించే... తిరస్కరించే అధికారం రాజ్యసభకు ఉండదు. కొన్ని సిఫార్సులను మాత్రమే ఎగువసభ చేయగలేదు. వాటిని స్వీకరించాలా, తిరస్కరించాలా అన్నది దిగువ సభ నిర్ణయిస్తుంది. ఆధార్ చట్టాన్ని ద్రవ్య బిల్లుగా ఆమోదించడంపై సుప్రీం తీర్పు సమయంలో జస్టిస్ చంద్రచూడ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనిని రాజ్యాంగం పేరిట మోసమన్నారు.

సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: జైరాం రమేశ్

ఆధార్ చట్టాన్ని ద్రవ్య బిల్లుగా ఆమోదించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించడాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. 'నవంబరులో సీజేఐ చంద్రచూడ్ పదవీ విరమణ పొందనున్నారు. ఈలోగా దీనిపై తీర్పు వస్తుందని ఆకాంక్షిస్తున్న'ట్లు ఎక్స్ మాధ్యమంగా జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'గత పదేళ్లల్లో అనేక చట్టాలను ద్రవ్య బిల్లులుగా ప్రవేశపెట్టి పార్లమెంటులో బుల్డోజ్ చేశారు. 2016లో తెచ్చిన ఆధార్ చట్టమే ఇందుకు ఉత్తమ ఉదాహరణ. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశాను. నాడు ఆధార్పై సుప్రీం తీర్పు వచ్చినప్పుడు ప్రస్తుత సీజేఐ అసంతృప్తి వ్యక్తంచేశారు. 2014 నుంచి అధికరణ 110 దుర్వినియోగమవుతుండటంపై విచారణకు వేరుగా రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని సీజేఐ చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం. నవంబరులో సీజేఐ చంద్రచూడ్ రిటైర్మెంట్ కంటే ముందే దీనిపై తుది తీర్పు రాగలదని ఆకాంక్షిస్తున్నా' అని జైరాం రమేశ్ వెల్లడించారు.

జీపీఎస్ జీవో నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

అమలుకు జీవో జారీచేయడాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే ఉద్యమిస్తామని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరించాయి. ఇప్పటికే కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ కార్యాచరణ రూపొందించాయి. జీవో విడుదల రోజే వాటి ప్రతులను దహనం చేసి నిరసన తెలిపాయి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) తేవాలంటూ ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా సీపీఎస్ ఉద్యోగ సంఘాలు ఏర్పాటై ప్రభుత్వాలను నిలదీస్తున్నాయి. 2019 ఎన్నికల్లో సీపీఎస్ రద్దు చేస్తానని వైసీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక వాటి అమలు సాధ్యం కాదంటూ చేతులెత్తేసింది. దీంతో సీపీఎస్ రద్దుపై దశల వారీగా ఉద్యోగులు చేసిన పోరాటంతో గత ప్రభుత్వం దిగి వచ్చింది. అనేక చర్చల అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలకు వ్యతిరేకంగా జీపీఎస్ను తెరపైకి తెచ్చింది. ఈ విధానంపై ఉద్యోగులు, సంఘాల నేతలు ఏకీభవించనప్పటికీ...ప్రభుత్వం మొండిగా ప్రతిపాదించింది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి... ఎన్నికల మేనిఫెస్టోలో జీపీఎస్ కంటే మరింత మెరుగైన విధానం తెస్తామని పొందుపరిచింది. అయితే అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా జీపీఎస్ జీవో విడుదలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వానికీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికీ తేడా ఏమిటంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సీపీఎస్ కింద 3.50లక్షల మందికిపైగా ఉద్యోగులున్నారు. ఇందులో ఉపాధ్యాయులు, ఆర్టీసీ, గ్రామ, వార్డు సచివాలయ, రెవెన్యూ తదితర విభాగాల ఉద్యోగులు ఉంటారు. వారందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యమిస్తున్నప్పటికీ, మధ్యలో జీపీఎస్ తీసుకురావడంపై ఆందోళన చెందుతున్నారు. జీపీఎస్ ఉత్తర్వుల్ని తక్షణమే విరమించుకోకుంటే ఉద్యమం తథ్యమని ఉపాధ్యాయ సంఘాలు చేసిన హెచ్చరికలకు ఎట్టకేలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. జీపీఎస్ జీవో రద్దు చేయాలని అన్ని జిల్లాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామని ఎస్టీయూ తెలిపింది. ఏపీటీఎఫ్ అధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. జీపీఎస్ జీఓ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం చర్చించాలి: ఎస్టీయూ

ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించాలని, ఇందుకోసం సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేయాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథ్రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన గత వైసీపీ ప్రభుత్వం హామీని తుంగలో తొక్కి జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో వచ్చిన వ్యతిరేకత దృష్ట్యా జీపీఎస్ విధానం అమలుపై ఉత్తర్వులు ఇవ్వలేదని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీపీఎస్ కన్నా మెరుగైన విధానం తెస్తామని చెప్పి...ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా, గత ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ విధానాన్ని యథాతథంగా అమలు చేస్తామని గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. లేకపోతే జీపీఎస్ విధానంపై మరో పోరాటానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం తప్ప మరే ప్రత్యామ్నాయాన్ని ఎస్టీయూ అంగీకరించబోదని స్పష్టంచేశారు. ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సమావేశం ఏర్పాటు చేయడానికి చొరవ చూపడం లేదన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం ఏర్పాటుకు చొరవ చూపాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు.

గురుకులంలో కలకలం

(మొదటిపేజీ తరువాయి)

సరిపోక ... సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా విద్యార్థులను 108 వాహనాలలో తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనపై రాష్ట్ర సాంఘికసంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విచారం వ్యక్తంచేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్తో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో కలిసి గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వైద్య అధికారులతో మాట్లాడి... మెరుగైన వైద్యం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు వారికి అందుతున్న వైద్యసేవలు తెలియచేయాలని ఆదేశించారు. అనంతరం నాయుడుపేట గురుకుల పాఠశాలకు చేరుకుని ఘటనపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తిరుపతి డిఎంహెచ్ఓ డాక్టర్. శ్రీహరి తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుచేసి...



విద్యార్థుల అస్వస్థతకు కారకులైన వారిపై రెండు రోజుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గురుకుల పాఠశాలకు, మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. పాఠశాలలో ఉండాలనుకుంటున్న విద్యార్థులను స్థానికంగా ఉన్న కళ్యాణ మండపాలలో ఉంచి వారికి వసతి, భోజన ఏర్పాట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. మూడు రోజుల లోపు గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తొలుత నాయుడుపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను, వారి తోటి విద్యార్థులను విచారించారు. గురుకులంలో అపరిశుభ్ర పరిస్థితులను స్వయంగా చూసి అధికారులకు చీవాట్లు పెట్టారు. ఈ పాఠశాలలో ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ వరకు 887మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు గురుకుల పాఠశాలల తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ పద్మజ కలెక్టర్కు తెలియజేశారు. ప్రిన్సిపాల్ దాదాపీర్, వార్డెన్ విజయభాస్కర్ లను కలెక్టర్ స్వయంగా విచారించారు. కాగా భయాందోళనకు గురైన కొంతమంది తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందికి తెలుపకుండానే... వారి పిల్లలను ఊర్లకు తీసుకుని వెళ్లడం కనిపించింది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్.విజయశ్రీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను స్వయంగా పరిశీలించారు. నాయుడుపేట గురుకుల పాఠశాల వద్దకు వచ్చిన తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. రోజుల వ్యవధిలో పరిస్థితులు చక్కబడతాయని విద్యార్థులకు మెరుగైన వసతులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి పార్లమెంటు సభ్యుడు గురుమూర్తి నాయుడుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలించి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఆర్డీఓ చంద్రముని, నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి,రెవెన్యూ సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి నుంచి విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందేలా కృషి చేశారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయం

(మొదటిపేజీ తరువాయి)

జనసేన పార్టీ తరపున ఎన్నికైన లోక్సభ సభ్యులకు, శాసనసభ, శాసన మండలి సభ్యులకు పవన్ కల్యాణ్ సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'భారతదేశ రాజకీయ చరిత్రలో జనసేన సాధించిన విజయం రాజకీయ నిపుణులకు, రాజనీతిశాస్త్ర విభాగంలో కేస్ స్టడీ అయింది. ఓ రాక్షస పాలనను అంతం చేయడానికి ప్రజలు ఎంతో నిశ్శబ్దంగా, క్రమశిక్షణగా చేసిన ఓటు పోరాటం గొప్పది. ప్రజలు కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో పాటు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని మనమంతా సమష్టిగా పని చేసి ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాల్సిన అవసరం ఉంది' అని ఉద్బోధించారు. విశాఖ స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేత, రైల్వే జోన్ ఏర్పాటు, రాష్ట్రంలో ఉపాధి అవకాశాల పెంపు గురించి ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడతానని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు మళ్లీ మనం చేయకూడదని, వైసీపీ నాయకులు మనకి శత్రువులు కాదని, కేవలం రాజకీయ ప్రత్యర్థులు మాత్రమేనని పవన్ చెప్పారు. వారి విధానాల మీదనే మన పోరాటం తప్ప...వ్యక్తిగతంగా కాదన్నారు. ఈ సందేశాన్ని ప్రతి ఒక్కరు లోతుగా అర్థం చేసుకోవాలని, కక్ష సాధింపు, వ్యక్తిగత వేధింపులు, దూషణలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఏదైనా అంశంపై చర్చ జరిగినప్పుడు భావంలోని తీవ్రతను భాషలో చూపించాల్సిన అవసరం లేదు. సబ్జెక్ట్ మీద పూర్తి అవగాహన ఉంటే పరుషపదజాలం లేకుండానే చెప్పవచ్చు. దీనిని ప్రతి ఒక్కరు పాటించాలి. పార్టీని పటిష్టం చేయడానికి ఎవరి స్థాయిలో వారు బలంగా పని చేయాలి. జనసేన ప్రజాప్రతినిధులు అధికార దుర్వినియోగం చేస్తే సహించను. అధికారులతో కూడా చాలా హుందాగా మాట్లాడాలి. ఇంట్లో కుటుంబ సభ్యులను అధికారిక కార్యక్రమాల్లో జోక్యం చేయనీయొద్దు. వారసత్వ రాజకీయాలకు జనసేన పార్టీ వ్యతిరేకం కాదు గానీ... నాయకుల కుటుంబ సభ్యులను సహజ ధోరణిలో రాజకీయాల్లోకి తీసుకురావాలి తప్పితే జనం మీద రుద్ది వారిని ప్రమోట్ చేయాలనుకుంటే మాత్రం సహించను. రాజకీయాలను సంస్కరించాలని వచ్చిన మనమే సంస్కార హీనులుగా మారకూడదు. దీనిపై పార్టీ క్రమశిక్షణ కమిటీకి పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నాను. ప్రజలు మనల్ని ఎంతో నమ్మి ఇచ్చిన విజయాన్ని దుర్వినియోగం చేయొద్దు. నేను లేకపోతే పార్టీ లేదు అనుకునే తత్వం వీడాలి. ఎవరు లేకపోయినా జనసేన పార్టీ ప్రయాణం ఆగిపోదు. కాలం చాలా గొప్పది. మాకంటే గొప్పవారు ఎవరూ లేరు అనుకున్న వారినే 11 సీట్లకు పరిమితం చేసింది. అదే తీరులో మనం ఆలోచిస్తే మన పరిస్థితి ఏంటి అన్నది ఆలోచించాలని పవన్ కల్యాణ్ కోరారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని సత్కారం అందుకున్నారు.

రాజ్యసభలో బీజేపీకి కష్టాలే

(మొదటిపేజీ తరువాయి)

తమిళనాడులోని అన్నాడీఎంకే, ఏపీ నుంచి వైసీపీ కీలకంగా మారాయి. ఈ రెండు పార్టీల ఎంపీలను (అన్నాడీఎంకే 4, వైసీపీ 11) కలిపిన మొత్తం 101 మంది అడంతో బిల్లులు ఆమోదం పొందడానికి మరో 13 మంది ఎంపీల బలం అవసరం కాగా ఇప్పటి వరకు మిత్రపక్షాలుగా ఉన్న వైసీపీ(11), అన్నాడీఎంకే (4) ఎన్నికలకు ముందు ఎన్డీయేకు దూరం జరిగాయి. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అధికార బీజేపీకి ఈ రెండు పార్టీలు మద్దతు ఇస్తాయా లేదా అన్నది సంక్లిష్టంగా మారింది. బిల్లుల ఆమోదం విషయంలో గట్టెక్కాలంటే వైసీపీ మద్దతు ఎన్డీయేకు తప్పనిసరి. గతంలో ఎన్డీయేకు మరో మిత్రపక్షంగా ఉన్న ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్కు చెందిన బిజూ జనతాదళ్ పార్టీ కూడా ఎన్నికల ముందు బీజేపీతో తెగతెంపులు చేసుకుంది. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీకి మద్దతు ఇచ్చేది లేదని ఇప్పటికే బీజేడీ తేల్చి చెప్పింది. బీజేడీకి తొమ్మిది మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. అన్నాడీఎంకే, బీజేడీ... అధికార పార్టీకి మద్దతు ఇవ్వకుంటే బీజేపీ నామినేటెడ్ సభ్యుల ఓట్లపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజ్యసభలో 12 మంది నామినేటెడ్ సభ్యులు ఉన్నారు. అయితే వీరు పార్టీతో పొత్తు లేకపోయినప్పటికీ ప్రభుత్వమే ఎంపిక చేసినందున బిల్లుల ఆమోదంలో వారు అధికార పార్టీకి మద్దతునిచ్చే అవకాశం ఉంది. వీరితోపాటు బీఆర్ఎస్కు చెందిన నలుగురు ఎంపీలు, స్వతంత్రులు కూడా కీలకంగా మారారు. ప్రస్తుతం రాజ్యసభలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది ఈ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటిలో మహారాష్ట్ర, అసోం, బీహార్లో రెండు చొప్పున, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, త్రిపురలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని కూటమికి అసోం, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపుర నుంచి ఏడు చోట్ల గెలిచే అవకాశం ఉంది. ఇక మహారాష్ట్రలో మరో రెండు దక్కించుకునే అవకాశం ఉంది. దీంతో బీజేపీకి అదనంగా తొమ్మిది సీట్లు లభిస్తాయి. వీటితోపాటు నామినేటెడ్ సభ్యుల ఓట్లు, వైసీపీ ఓట్లు కలిపితే బీజేపీకి మెజారిటీ మార్కును దాటేందుకు కావాల్సినంత బలం ఉంటుంది.

సిరియాలో సార్వత్రిక ఎన్నికలు

డమాస్కస్: సిరియాలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరిగాయి. దేశ వ్యాప్తంగా 8,151 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు ఓటింగ్ జరిగింది. పీపుల్స్ అసెంబ్లీలోని 250 స్థానాలకు మొత్తం 1,516 మంది పోటీ చేశారు. దేశంలో 18ఏళ్లు పైబడిన ప్రతి పౌరునికి ఓటు హక్కు ఉన్నది. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్లను లెక్కించి ఫలితాలు విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ సుప్రీం జ్యుడిషియల్ కమిటీ అధ్వర్యంలో జరుగుతుంది. సిరియా పార్లమెంటుకు నాలుగేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. అనేక పార్టీలు పోటీ చేస్తాయి కానీ అధికార బాత్ పార్టీ, దాని మిత్రపక్షాలదే పైచేయిగా ఎన్నికలు జరుగుతాయి. 1963 నుంచి సిరియాలో బాత్ పార్టీ ఆధిపత్యం కొనసాగుతోంది.

మిర్చి ధర పెంపునకు చర్యలు చేపట్టాలి

మంత్రి అచ్చెన్నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మిర్చి ధర పెంపునకు సత్వర చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ సోమవారం ఒక లేఖ రాశారు. మిర్చి ధరలు తగ్గి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గతేడాది మిర్చి నిల్వలు కోల్డ్ స్టోరేజీలలో సుమారు 80 లక్షల బస్తాలు (40 లక్షల క్వింటాళ్లు) ఉన్నాయని వివరించారు. ఇతర దేశాలకు ఎగుమతి ఆర్డర్లు నిలిచిపోవడంతో ప్రస్తుతం కొనుగోళ్లు పూర్తిగా మందగించాయని వ్యాపారులు అంటున్నారని, దీంతో ధరలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. క్వింటా రూ.23 వేల వరకు పలికిన మిర్చి ధర ప్రస్తుతం క్వింటా రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు మాత్రమే ధర లభిస్తోందన్నారు. గతేడాది నిల్వలు ఇంత వరకు అమ్ముడుపోక ఈ సీజన్‌లో మిర్చిపంట సాగు చేయాలా, వద్దా అనే అయోమయ స్థితిలో రైతాంగం ఉన్నారన్నారు. వెంటనే జోక్యం చేసుకుని రైతు ప్రతినిధులు, వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు చేపట్టాలని, గిట్టుబాటు ధర లభించేలా రైతులకు మనోధైర్యం కల్పించాలని మంత్రిని కోరారు.

నదుల అనుసంధాన దార్శనికుడు కేఎల్‌రావు

మంత్రి రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ఐదేళ్ల పాలనలో పోలవరం నిర్లక్ష్యానికి గురైందని, దాంతోనే డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. సోమవారం విజయవాడ కేఎల్‌రావు ఘాట్‌లో జలవనరులశాఖ నిర్వహించిన పద్మభూషణ్ డాక్టర్ కేఎల్ రావు 122వ జయంతి వేడుకలకు మంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కేఎల్‌రావు చిత్ర పటానికి, విగ్రహానికి ఆయన పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ... 50ఏళ్ల క్రితమే నదుల అనుసంధానాన్ని ప్రతిపాదించిన దార్శనికుడు, తెలుగుజాతి గర్వించదగిన ఇంజనీర్ కేఎల్‌రావు అని కొనియాడారు. నీటి పారుదల రంగానికి విశేష సేవలు అందించి, భావితరాలకు స్ఫూర్తిగా నిలిచిన సర్ ఆర్థర్ కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కేఎల్ రావు, శ్రీరామకృష్ణయ్య వంటి మహనీయుల జయంతి వేడుకలను 2014-19 ప్రభుత్వ పాలనలో ఎంతో ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వ పాలనలో సాగు, తాగునీటి రంగాలకు విశేష సేవలు అందించిన మహనీయుల జయంతి కార్యక్రమాలను నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. నాగార్జున సాగర్ రూపశిల్పి, కృష్ణాడెల్టాను సస్యశ్యామలం చేసిన కేఎల్ రావు విగ్రహానికి కనీసం రంగు వేసిన పాపాన కూడా పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని చెప్పారు. కేఎల్ రావు తన దేశభక్తి, మేధాసంపత్తితో నీటిపారుదల రంగంలో దేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దారని కొనియాడారు. గ్రావిటీ, ఆర్చి, కాంక్రీట్ డ్యామ్‌లు, రాతి ఆనకట్టలు, విద్యుదుత్పాదక కేంద్రాలు, పులిచింతల వంటి ఎన్నో బహుళార్థక సాధక ప్రాజెక్టుల నిర్మాణాలు ఎలాంటి విదేశీ నిపుణుల సహకారం లేకుండా రూపొందాయంటే...అది కేఎల్ రావు ఘనతేనని కీర్తించారు. కేఎల్ రావు కలల సాకారం దిశగా సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారని, నదుల అనుసంధానానికి పెద్దపీట వేసేలా పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు తొలి పర్యటనగా పోలవరం వెళ్లారని, ప్రతి సోమవారం పోలవరంపై సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. 2019లో ప్రభుత్వం మారడం పోలవరానికి శాపమని చెప్పారు. 2014-19 ప్రభుత్వ కాలంలోనే పోలవరం పనులను 72శాతం చంద్రబాబు పూర్తి చేశారన్నారు. నిర్మాణ సంస్థలను మార్చడం, రద్దు చేయడం తదితర కార్యక్రమాలతో దాదాపు 13 నెలలు ప్రాజెక్టులో పనులు చేయకుండా ఖాళీగా ఉంచారని విమర్శించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ రిటైర్డ్ సీనియర్ ఇంజనీర్లు ఆర్.సతీశ్ కుమార్, బీఎస్ఎస్ శ్రీనివాస్ యాదవ్, ఎంవీ కృష్ణారావు, కేవీ కృష్ణారావు, మారుతి ప్రసాద్‌ను మంత్రి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఇంజనీర్ చీఫ్ అడ్మిన్ కె.శ్రీనివాస్, హైడ్రాలజీ సీఈ కుమార్, మైనర్ సీఈ సాయిరామ్ ప్రసాద్, ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్‌బాబు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎస్.తిరుమల రావు, అపెక్స్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అత్యాచారాల నిరోధానికి కఠిన చర్యలు

సత్వర శిక్షల అమలుకు ప్రత్యేక కోర్టులు: మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహిళలపై అత్యాచారాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని, నేరస్థులు ఎంతటి వారైనా వదలబోమని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్ర సచివాలయలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... లా అండ్ ఆర్డర్ అమలు, గంజాయి, చీప్ లిక్కర్ అరికట్టే అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారని వివరించారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి బాలిక ఘటనపై ఇప్పటికే ముగ్గురు మైనర్లు అరెస్ట్ అయ్యారని, బాలిక మృతదేహం ఇంకా లభించలేదన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బలగాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారని, గంజాయి, మద్యం మత్తులో అత్యాచారాలు చేసే నిందితులు ఎలాంటి వారైనా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి, నిందితులకు వెంటనే శిక్షలు కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. విజయ నగరం జిల్లా రామభద్రపురం మండలంలో ఆరు నెలల పసికందుపై వరసకు తాతైన వ్యక్తి అత్యాచారయత్నం చేయడం దురదృష్టకర పరిణామమని చెప్పారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నానని, కేవలం మద్యం మత్తులో ఈ సంఘటన జరిగినట్లు నా దృష్టికి వచ్చిందన్నారు. గంజాయి, నకిలీ మద్యానికి బానిసలై వావివరసలు మరచిపోతున్నారని, పోర్న్ సైట్లు కూడా మైనర్లను చెడుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. సెల్ ఫోన్లు పిల్లలకు ఇచ్చేముందు తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. డీ ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆడపిల్లలపై అత్యాచారం చేయాలనే ఆలోచన వచ్చిందంటే భయపడేలా శిక్షలు అమలుకు చట్టాలు రూపొందిస్తామని ఆమె పునరుద్ఘాటించారు. ముచ్చుమర్రి అత్యాచార బాధితురాలి కుటుంబానికి పదిలక్షల రూపాయల ఆర్థిక సహాయం, విజయనగరం జిల్లా అత్యాచార బాధిత పసికందుకు ఐదు లక్షల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. త్వరలో ఆ పరిహారాన్ని ఆ కుటుంబాలకు స్వయంగా అందజేస్తానని చెప్పారు.

షరతుల్లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఎటువంటి షరతులు విధించకుండా నిరుద్యోగులందరికీ 'ముఖ్యమంత్రి యువ నేస్తం' ద్వారా నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక హనుమాన్ పేట దాసరి భవన్‌లో సోమవారం పరుచూరి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగుల ఓట్లతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా అనేక షరతులు పెట్టడాన్ని వారు నిరసించారు. కుటుంబంలో ఎవరికైనా పెన్షన్ వస్తే నిరుద్యోగ భృతి ఇవ్వమని, కనీస ఆదాయం పదివేల రూపాయలకు మించి ఉండకూడదని, గ్రామీణ ప్రాంతాల్లో ఐదు ఎకరాల కంటే సాగు భూమి ఉండకూడదని, పట్టణ ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల నివాస స్థలం ఉండకూడదనే షరతులను పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుద్యోగ యువతను పథకానికి అర్హులు కాకుండా చేసేందుకే నిబంధనలు విధిస్తున్నారన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగాలకు కనీస వయోపరిమితి 45 సంవత్సరాలు ఉండగా... ముఖ్యమంత్రి యువ నేస్తం నిరుద్యోగ భృతి పథకానికి వయో పరిమితి 35 సంవత్సరాలుగా నిర్ణయించడం సరికాదని... 45 సంవత్సరాలకు పెంచాలని కోరారు. డీఎస్సీని పాత పద్ధతిలోనే నిర్వహించాలని, నూతన విధానం ఆన్‌లైన్‌లో నిర్వహించడం వలన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెబుతూ... రాత పరీక్ష ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్ లైన్ లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు మోచ్చాడ యుగంధర్, జి.నాగరాముడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు కే. శ్రీనివాసులు, లంకా గోవిందరాజులు, శ్రీనివాస్, అప్పన్న, కరుణానిధి, జక్కుల వెంకటేష్, మున్నా, జంగాల చైతన్య లతోపాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత పంటల బీమా పథకం కొనసాగించాలి

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పంటల బీమా పరిహారం వెంటనే కౌలు రైతులకు, రైతులకు చెల్లించాలని... ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2016 నుంచి అమలవుతున్న ప్రధానమంత్రి పంటల బీమా పథకం, పునరుద్ధరించిన వాతావరణ పంటల బీమా పథకాల కింద రైతుల వాటాగా చెల్లించాల్సిన బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి చిన్న, సన్నకారు రైతులను, కౌలురైతులను ఆదుకోవాలన్నారు. 2016లో తీసుకు వచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో బీమాలో రైతుల వాటాగా ఖరీఫ్‌లో 2శాతం, రబీలో 1.5శాతం, వాణిజ్య పంటలకు 5శాతం చెల్లిస్తే... మిగిలిన ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించేవని గుర్తుచేశారు. ఉచిత పంటల బీమా పథకంలో భాగంగా రైతులు చెల్లించాల్సిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేదని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పాత పద్ధతిలో పంటల బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. పాత పద్ధతి అంటే గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రి ఉన్నపుడు (2016-2019 మధ్య కాలంలో)అమలు చేసిన బీమా పథకంలాగా రైతులే బీమా ప్రీమియం చెల్లించే విధానమా? లేదా వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తారా? అనేది స్పష్టత ఇవ్వకపోవడంతో రైతాంగం గందరగోళంలో ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పంటల బీమా పథకాల గురించి తక్షణమే వివరణ ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం రెండేళ్లుగా రైతులకు, కౌలురైతులకు బీమా పరిహారం చెల్లించకుండా రూ.1,380 కోట్లను పెండింగ్‌లో పెట్టిందని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 2024 ఖరీఫ్ ప్రారంభమై 45రోజులు పూర్తి అవుతున్నా బీమా పరిహారం అందక పోవడంతో రైతులు, కౌలురైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పరస్పర ఆరోపణలకు దిగకుండా రైతాంగానికి న్యాయం చేయాలని వారు కోరారు. పంటల బీమా పరిహారాన్ని తక్షణమే విడుదల చేసి రైతులు, కౌలురైతుల ఖాతాలో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకే పరిహారం దక్కేలా చూడాలన్నారు. 2024-2025 సంవత్సరం ఖరీఫ్, రబీకి ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేసి చిన్న, సన్నకారు, కౌలురైతులను ఆదుకోవాలి కాటమయ్య, జములయ్య విజ్ఞప్తి చేశారు.

'గురుకుల' ఘటనలపై విచారించాలి

ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో వరుస వారీగా జరిగిన సంఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.మల్లిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకుల సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వ నిబంధనలు అమలుకు జిల్లా, నియోజకవర్గస్థాయి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయుడుపేటలోని ఎల్ఐ సాగరం గురుకుల పాఠశాలలో ఆదివారం కలుషిత ఆహారంతిని దాదాపు 110 మందికి పైగా విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారని వివరించారు. ఈ ఘటనపై విచారించి, సంబంధిత ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంలో అవకతవకలు, విద్యార్థుల ఆందోళనపై దర్యాప్తు చేపట్టాలన్నారు.

బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి: రాఘవులు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: బీజేపీతో టీడీపీ, జనసేన జతకట్టడం సరికాదని, బీజేపీది ధృతరాష్ట్రకౌగిలి అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో చేరిన పార్టీలు దెబ్బతినక తప్పదని హెచ్చరించారు. ఏపీలో వైసీపీ, తెలంగాణలో బీఆర్ఎస్ ఇందుకు తాజా ఉదాహరణ అని రాఘవులు గుర్తుచేశారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన మేలుకోవాలని, బీజేపీతో స్నేహం చేసిన ప్రాంతీయ పార్టీల పరిస్థితి ఎలా ఉందో దేశంలో చూస్తున్నామన్నారు. మహారాష్ట్రలో శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీలను చీల్చి...అక్రమంగా, అన్యాయంగా అధికారం చేపట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, శ్రీకాకుళంలో జంఝావతి ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తికాలేదన్నారు. ఒడిశాతో వివాదాలను గత ప్రభుత్వం పరిష్కరించలేకపోయిందన్నారు. ఇప్పుడు అక్కడ బీజేపీ ప్రభుత్వమే ఉన్నందున మన రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో అవినీతి పేరుతో కాంట్రాక్టరు జగన్ మార్చివేశారని, వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాలేదన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెబుతున్నారని, అలా చేస్తే మంచిదేనన్నారు. రాజధాని విషయంలో సీఎం చంద్రబాబు మళ్లీ సింగపూర్, మలేషియా పాట పాడకుండా ఉంటే మంచిదని హితవు పలికారు. రాజధానిని మళ్లీ మార్చకుండా పటిష్ట చట్టం తీసుకురావాలని రాఘవులు డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మూలం రమేశ్, జిల్లా నాయకులు ఎం.మోహన్ రావు, కె.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

పురందేశ్వరికి యూనియన్ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రైవేటీకరణను ఆపాలని, కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసేలా ప్రయత్నం చేయాలని రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించ వద్దని, అవసరమైతే సెయిల్‌లో విలీనం చేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నష్టాల బారి నుండి కేంద్ర ప్రభుత్వమే ప్లాంట్‌ను రక్షించాలని పురందేశ్వరిని పోరాట కమిటీ నేతలు కోరారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, కచ్చితంగా సెయిల్‌లో విలీనం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు అధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రామస్వామి, విల్లా రామ్మోహన్ రావు, వరసాల శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బెంగళూరుకు జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ బెంగళూరు వెళ్లారు. తన కాలికి వైద్య పరీక్షల నిమిత్తం ఆయన బెంగళూరు వెళ్లినట్లు తెలిసింది. సోమవారం ఉదయం తాడేపల్లి నుంచి జగన్ బయల్దేరారు. వారం రోజులపాటు బెంగళూరులోనే జగన్ గడిపే అవకాశముంది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పరాజయం అనంతరం జగన్ ఇటీవల బెంగళూరు వెళ్లారు. మళ్లీ తాడేపల్లి వచ్చారు. నెల్లూరు జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఆయన పరామర్శించారు. కొద్దిరోజులు తాడేపల్లికే పరిమితమైన జగన్... తిరిగి బెంగళూరు వెళ్లారు. వైసీపీ అధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రణాళిక రూపొందించగా... మరికొన్ని నెలలు కూటమి ప్రభుత్వానికి గడువు ఇవ్వాలని నిర్ణయించారు. దీనికితోడు జగన్ బెంగళూరు వెళ్లడంతో ఆ పార్టీ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు.

దుష్ప్రచారాలకు భయపడను

చట్టప్రకారం చర్యలు: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఒక మహిళా అధికారి విషయంలో తనపై చేసిన దుష్ప్రచారాన్ని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తిప్పికొట్టారు. ఆదివాసీ మహిళ విషయంలో మీడియా తనపై అవాస్తవాలు, ఆధారాలు లేని ప్రచారం చేసిందని మండిపడ్డారు. తనపై కొన్ని టీవీ ఛానళ్లు దుష్ప్రచారం చేశాయన్నారు. వార్తను ప్రసారం చేసే ముందు వివరణ తీసుకోకుండా, ఆధారాలు లేకుండా టెలికాస్ట్ చేసిన వారితో క్షమాపణలు చెప్పిస్తానన్నారు. హోటల్ మేఘాలయలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ వారు కూడా కొంతమంది తనపై దుష్ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కిందస్థాయి నుంచి జీవితంలో ఎదిగానని, ఎనిమిది ఎకరాల భూమి ఉన్న వ్యవసాయ కుటుంబం నుంచి తాను వచ్చానని, తనపై దుష్ప్రచారం చేసిన వాళ్లందరి జీవితాలు తనకు తెలుసన్నారు. బెదిరింపులు పాల్పడి తాను సంపాదించలేదన్నారు. ఆదివాసీ మహిళతో సంబంధాన్ని అంటగట్టిన వారు వాటిని రుజువు చేయాలని, కుట్ర, కుతంత్రాల వెనుక ఎవరున్నారో వారందరి సంగతి తేలుస్తానన్నారు. యూ ట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియా దుష్ప్రచారాలపై కూడా లీగల్ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పార్లమెంటు సభ్యుడిగా తన హక్కుల్ని కాపాడుకోడానికి తనపై దుష్ప్రచారం చేసిన వారిపై ఎడిటర్స్ గిల్డ్, పార్లమెంట్, నేషనల్ ఉమెన్ కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, ఏపీ ఎస్టీ కమిషన్, డిఫమేషన్ కేసులు ఫైల్ చేస్తానని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలన్నింటిలో తాను పోరాడతానన్నారు. ఆదివాసీ ఆడబిడ్డను బజారుకీడ్చిన వారందరిపై చర్యలు తీసుకుంటానన్నారు. సోషల్ మీడియాలో నకిలీ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతానని సాయిరెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ గుండాలు వైసీపీకి చెందిన ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతూ కొడుతున్నారని, కుటుంబాలను హింసిస్తూ అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. తన పేరు ప్రఖ్యాతలు దెబ్బతీయడానికి ప్రయత్నించిన వారు ఎంతటి పెద్ద వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. ఇద్దరు వ్యక్తులు ఆదివారం మోటర్‌బైక్‌పై తమ ఇంటికి వచ్చారని, విజయసాయిరెడ్డి ఉన్నాడా పారిపోయాడా అని అడిగారని, టీడీపీ గుండా తన ఇంటి ముందుకు వచ్చి ప్రశ్నించాడని, తాను ఎక్కడికి పారిపోలేదని, టైమ్ చెబితే తాను ఒక్కడినే వెళ్తానని సవాలు చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, తాము ప్రతిపక్షంలో ఉన్నా భయపడే ప్రసక్తి లేదన్నారు. మళ్లీ ఐదేళ్లలో వైసీపీ అధికారంలోకి వస్తుందని, మధ్యంతరం వస్తే మళ్లీ తామే అధికారంలోకి వస్తామన్నారు. గతంలో తాను టీవీ ఛానల్ పెట్టాలని భావించానని, కానీ జగన్ వారించడంతో ఆగిపోయానని, ఇప్పుడు ఖచ్చితంగా ఒక టీవీ చానల్ అతి త్వరలో తీసుకు వస్తానని సాయిరెడ్డి ప్రకటించారు. తనపై ఆరోపణలు చేసిన మదన్‌మోహన్ రెండు సార్లు స్కాలర్‌షిప్ కోసం తన దగ్గరకు వచ్చాడని అంతకు మించి అతడితో ఎలాంటి పరిచయం కూడా లేదన్నారు. ఓ మీడియా ఛానల్ యజమానితో కలిసి అతడు ఈ కుట్ర పన్నాడని, దీనిపై పార్లమెంటులో న్యాయపోరటం చేస్తానని ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్సీ జూపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

2016లోనే విడిపోయాం

నా బిడ్డను అక్రమ సంతానం అనడం దారుణం: ఏసీ శాంతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మీడియాలో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి స్పందించారు. మీడియాతో సోమవారం ఆమె మాట్లాడుతూ 2013 నవంబరులో మదన్‌మోహన్‌తో తనకు పెళ్లి అయిందని, 2015లో తమకు ఇద్దరు కవల పిల్లలు పుట్టారని తెలిపారు. లా విద్యను అభ్యసిస్తుండగా మదన్‌మోహన్ మానిపాటితో పెళ్లి అయిందన్నారు. అప్పటికే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నాడని పేర్కొన్నారు. పెళ్లి అయిన తర్వాత అతడు నన్ను దారుణంగా హింసించాడని ఆరోపించారు.భర్త వేధింపులు భరించలేక 2016లో తాము ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం విడాకులు రాసుకున్నామన్నారు. 2016లో మదన్ మోహన్ యూఎస్ వెళ్లిపోయాడని, 2020లో తనకు ఉద్యోగం వచ్చిందని, తాను, న్యాయవాది సుభాశ్ ఇద్దరం ఇష్టపడి పెళ్లి చేసుకున్నామని ఆమె వివరించారు. అతడి ద్వారా తాను మరో బిడ్డకు జన్మనిచ్చినట్టు చెప్పారు. సుభాశ్ తల్లి సమ్మతంతోనే తమ పెళ్లి జరిగిందని చెప్పారు. తన ఇద్దరు పిల్లలు, సుభాశ్ కుమార్తెను పెంచాలనే సమ్మతితో తమ పెళ్లి జరిగిందన్నారు. సుభాశ్‌తో పెళ్లి జరిగిన తర్వాత కూడా మదన్‌మోహన్ వేధించాడని ఆరోపించారు. మదన్ మోహన్, తాను విశాఖపట్నం కోర్టులో విడాకులు తీసుకున్నామని చెప్పారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరానని, గిరిజన మహిళను కాబట్టి నన్ను టార్గెట్ చేశారని, ఎంపీ విజయసాయిరెడ్డి ని నేను విశాఖపట్నం లోనే చూశానని చెప్పారు. తండ్రిలాంటి సాయిరెడ్డిపై దుష్ప్రచారం చేయడం అత్యంత దారుణమన్నారు. విజయసాయిరెడ్డితో కేవలం విధులకు సంబంధించిన విషయాలే మాట్లాడానని అన్నారు. ఓ పత్రికలో రూ.100 కోట్లు సంపాదించాను అని రాశారని, అందుకు మదన్ మోహన్ నన్ను రూ.75 కోట్లు అడిగాడని, గిరిజన మహిళని అని కక్ష గట్టి తనను సస్పెండ్ చేశారన్నారు. తనపై మోపిన అభియోగాల్లో ఎనిమిదింటితో అసలు తనకు సంబంధించినవే కాదన్నారు. తన వక్తిత్వ హననం చేశారని, మదన్ మోహన్ 2016లోనే తనకు విడాకుల ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడన్నారు. మీడియాలో నా బిడ్డను అక్రమ సంతానం అనడం దారుణమని, సుభాశ్ ను పెళ్లి చేసకున్న తర్వాత బిడ్డ పుట్టాడన్నారు. అడ్వకేట్ దగ్గర ఎంఓయూ రాసుకున్నప్పుడు కూడా మదన్‌మోహన్ ఆ బిడ్డ తన బిడ్డ కాదని లిఖితపూర్వకంగా కూడా రాశాడని వివరించారు. ఆ తర్వాత తనను వేధించడంతో కేసు కూడా పెట్టానన్నారు. మదన్‌మోహన్ అమెరికా అక్రమంగా వెళ్లాడని, అతడిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానన్నారు. గర్భిణీ అని చూడకుండా తనను కొట్టేవాడని అన్నారు.

27న జాతీయ ముఖ్య కార్యదర్శుల సమావేశం

కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాల్గవ జాతీయ ముఖ్యకార్యదర్శుల సమావేశాన్ని ఈనెల 27న నిర్వహిస్తామని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ వెల్లడించారు. ఈమేరకు సోమవారం దిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల(సీఎస్)తో వీడియో సమావేశం నిర్వహించారు. రాజీవ్ గౌబ మాట్లాడుతూ... ముఖ్య కార్యదర్శుల సమావేశాన్ని ఎక్కడ, ఎన్ని రోజులు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తా మన్నారు. నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని త్వరలో నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం ఇప్పటినుంచే సన్నాహాలు చేయాల్సి ఉంటుందన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశం(వికసిత్ భారత్)గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాల్లో భాగంగా ఈ రెండు సమావేశాలు ఎంతో కీలకమైనవని ఆయన చెప్పారు. గత డిసెంబరులో జరిగిన 3వ జాతీయ ముఖ్యకార్యదర్శుల సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ రెండు సమావేశాలకు సంబంధించి వివిధ ప్రాధాన్య అంశాలు, తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్‌లతో రాజీవ్ గౌబ చర్చించారు. ఈ వీడియో సమావేశంలో రాష్ట్రం నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్, పర్యాటక, వైద్యారోగ్య, పరిశ్రమలు-వాణిజ్యం-ఆహారశుద్ధి, ఉన్నత విద్య, సాంఘిక సంక్షేమ శాఖల కార్యదర్శులు వి.వినయ్ చంద్, మంజుల, ఎస్.యువరాజ్, సౌరవ్ గౌర్, కె.కన్నబాబు, ఎస్పీడీ శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్, సిహెచ్. హరికిరణ్, కృష్ణారెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు.

సంపాదకీయం

అబద్ధాలలో మోదీ మేటి

మోదీ సర్కారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు దేశ ప్రగతికి బాటలు వేయకపోగా నిరుద్యోగ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. కొత్తగా ఉద్యోగ, ఉపాధికల్పన జరగకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడిపోవడంతో నిరుద్యోగ వృద్ధిరేటు రికార్డు స్థాయికి చేరింది. భారత ఆర్థికవ్యవస్థ ఏడు శాతం వృద్ధి చెందినప్పటికీ ఆ స్థాయిలో ఉద్యోగాలకల్పన జరగడం లేదని స్పష్టమవుతోంది. వచ్చే దశాబ్దంలో ఆ స్థాయిలో దేశం వృద్ధి చెందాలన్నప్పటికీ శ్రామికశక్తికి తగినంత ఉద్యోగాలను సృష్టించడానికి దేశం చాలా కష్టపడాల్సి వస్తుందని సిటీ గ్రూపు ఒక నివేదికలో వెల్లడించింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశానికి ఉపాధిని పెంచడానికి మరింత సమగ్ర చర్యలు అవసరమని సూచించింది. సహజంగా మన దేశంలో నిరుద్యోగం పెరగడానికి ప్రధాన కారణాలు అధిక జనాభా, స్వల్ప ఉద్యోగావకాశాలు, కేంద్రీకృత సంపద. కేంద్రంలో ఎన్డీయే అధికారం చేపట్టిన తర్వాత ఉపాధి అవకాశాలు మరింత సన్నగిల్లడం, సంపద కేంద్రీకృతం విపరీతంగా పెరగడంతో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. మోదీ 2014 ఎన్నికల్లోనే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కొత్తవి రాకపోగా ఉన్నవి ఊడకొట్టారు. రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉపాధి అవకాశాలను మరింతగా దెబ్బతీశారు. గత పదేళ్లుగా కోట్లాదిమంది యువకుల కలలను ఛిన్నాభిన్నం చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదే. ప్రస్తుత ఏడాది జూన్‌లో నిరుద్యోగ రేటు ఏకంగా 9.2 శాతానికి ఎగిసి ఎనిమిది నెలల గరిష్టస్థాయి వద్ద నమోదైందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. ఇంతక్రితం మే నెలలో నిరుద్యోగస్థాయి రేటు 7 శాతంగా ఉంది. ఒక్క నెలలోనే అదనంగా 2.2 శాతం ఎగిసిపడటం ఆర్థిక వ్యవస్థలో డొల్లతనానికి మందగమనానికి నిదర్శనం. సీఎంఐఈ నిర్వహించిన కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే నివేదిక ప్రకారం 2023 జూన్‌లో నమోదయిన 8.5 శాతం నిరుద్యోగంతో పోల్చినా గడిచిన నెలలో ఈ రేటు మరింత పెరిగింది. నిరుద్యోగుల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. గతేడాది జూన్‌లో మహిళల్లో నిరుద్యోగం 15.1శాతంగా ఉంటే ఈ ఏడాది జూన్‌లో 18.5 శాతానికి పెరిగింది. పురుషుల్లో నిరుద్యోగం 7.7 శాతం నుంచి 7.8 శాతానికి చేరింది. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య ఆధారంగా సీఎంఐఈ ఈ రేటును రూపొందిస్తుంది. ఐఎల్ఓ నివేదిక ప్రకారం దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం యువత ఉన్నారు. ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం 2012-2019 మధ్య సుమారు 7 కోట్ల మంది యువత శ్రామికశక్తిలో చేరారు. దేశంలోని 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లలో 42.3 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 2023 నివేదిక తెలిపింది. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ సంస్థల సేవలో ఊడిగంచేస్తున్న కేంద్ర ప్రభుత్వం, దాని అధినేత మోదీ ఉద్యోగకల్పనపై చేస్తున్న ప్రకటనలు అందరూ ముక్కున వేలేసుకునేలా చేస్తున్నాయి. శనివారం ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ, గత మూడు నాలుగేళ్లలో 8 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని ప్రగల్భాలు పలికారు. కరోనా లాంటి సంక్షోభాలొచ్చినా దేశంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన జరిగిందని చెప్పడం ద్వారా ఉద్యోగాల కల్పనపై అబద్ధాల వలవిసిరారు. అయితే, వాస్తవ పరిస్థితి మోదీ ప్రకటనకు భిన్నంగా ఉంది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ వృద్ధి కలగజేసే అనర్థాలను అంచనా కట్టలేం. నిరాశా నిస్పృహలకు గురైన యువత అసాంఘిక శక్తుల చేతిలో పావులుగా మారే ప్రమాదం ఉంటుంది. మోదీ అధికారం చేపట్టాక పనిచేసే జనాభాలో సగం మందికి ఉద్యోగ, ఉపాధిలేకుండా పోయింది. ముఖ్యంగా 20-24 ఏళ్ల మధ్య వయస్కులలో నిరుద్యోగ రేటు ఏకంగా 40 శాతం కంటే ఎక్కువగా ఉండటం ఆందోళనకరం. శ్రామిక మార్కెట్‌లోకి కొత్తగా ప్రవేశించిన వారికి ఉద్యోగాలు కల్పించడానికి భారతదేశం వచ్చే దశాబ్దంలో సంవత్సరానికి సుమారు 1.2 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని సిటీ గ్రూపు ఆ నివేదికలో అంచనా వేసింది. ప్రస్తుత 7 శాతం వృద్ధి రేటు ఆధారంగా భారత్ సంవత్సరానికి 80-90 లక్షల ఉద్యోగాలను మాత్రమే సృష్టించగలదని ఆ నివేదిక పేర్కొంది.

దేశంలో సృష్టిస్తున్న ఉద్యోగాల నాణ్యత మరొక సవాలుగా ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం 20 శాతం కంటే తక్కువ వాటాను కలిగి ఉన్నప్పటికీ... ఇప్పటికీ 46 శాతం మంది శ్రామికశక్తి ఉపాధి పొందుతున్నట్టు అధికారిక గణంకాలు చెబుతున్నాయి. 2023లో మొత్తం ఉద్యోగాలలో తయారీ రంగం 11.4 శాతం వాటాను కలిగిఉంది. ఇది 2018 కంటే తక్కువ వాటా అని గణాంకాలు చెపుతున్నాయి. ప్రభుత్వ, బ్యాంకింగ్, విద్య, వైద్యం, తయారీ తదితర సంఘటిత రంగంలో 25.7 శాతం మంది పనిచేస్తున్నారు. ఇందులో కోవిడ్‌కు ముందు కంటే ఇప్పుడు తక్కువ మంది వ్యక్తులు పనిచేస్తున్నారు. ఈ రంగంలో ఉద్యోగాలకల్పన కనీసం 18 సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గిందని సిటీ గ్రూపు తెలిపింది. 58.2 కోట్లమంది స్వయం ఉపాధి కల్పనతో బతుకుతున్నారు. దేశంలో దాదాపు 12.2 కోట్ల మంది మాత్రమే సంఘటిత రంగంలో పని చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగం ముఖ్యంగా ఓటర్లలో ప్రధాన ప్రభావం కలిగించింది. ఈ ప్రభావం బీజేపీ సీట్లు భారీగా తగ్గడానికి కారణమయింది. మేకిన్ ఇండియా అంటూ మోదీ హడావుడి తప్ప ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బతినడంతో లక్షలాది మంది వీధిన పడ్డారు. రూపాయి పతనం, అంచనాలకందని వృద్ధిరేటు, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థలతో పరిస్థితి మరింత క్షీణించింది. ఈ కారణాలన్నింటితో కోట్లమందికి ఉపాధి కరవైంది. నిజవేతనాల్లో తగ్గుదలతో ప్రజల కొనుగోలుశక్తి సన్నగిల్లింది. నిరుద్యోగ వృద్ధిని అడ్డుకోవాలంటే తయారీరంగం పుంజుకునేలా చేయాలి. అందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందాలి. ఆ పనిచేయకుండా సంపన్నులను సంతృప్తి పరిచే చర్యలు చేపట్టడం వల్ల నిరుద్యోగ సమస్య ఎలా పరిష్కారమవు తుంది? మానవ వనరుల మీద వర్ధిల్లే చిన్న మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలు తిరిగి కోలుకునే చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. కాబట్టి దేశాన్ని అభివృద్ధి చేశాం, ఉద్యోగాలు కల్పిస్తున్నామని మోదీ చెప్పడం వట్టి ప్రచారార్భాటం, యువతను వంచించడమే. ఇప్పటికైనా పాలకులను నిలదీసేందుకు యువత కదం తొక్కాలి.

నాటో విస్తరణ - క్షిపణుల మోహరింపు

బుడ్డిగ జమిందార్

నాటో మిలిటరీ కూటమి ఏర్పడి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా 32 సభ్యదేశాలు జులై 9 నుండి 11వరకు వాషింగ్టన్‌లో శిఖరాగ్ర సమావేశాన్ని జరుపుకున్నాయి. ఈ సందర్భంగా యుద్ధ ప్రేరేపణ దిశగా రష్యాకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ సంవత్సరం ఉక్రెయిన్‌కు 4000కోట్ల డాలర్లను ఆయుధరూపంలో పంపాలని నిర్ణయించాయి. ఉక్రెయిన్‌లో ఒక నాటో కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా జర్మనీలో ఒక కమాండును ఏర్పాటు చేయనున్నారు. 2026 సంవత్సరం నాటికి అమెరికా నుండి దీర్ఘశ్రేణి సామర్థ్యంకల్గిన టొమాహాక్ క్రూయిజ్ క్షిపణులను రష్యా దేశంలోని వివిధ నగరాలకు ఎక్కుబెట్టే విధంగా జర్మనీలో స్థాపించటానికి ప్రధాన ఉద్దేశంగా నాటో శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. ఈ క్షిపణులు రెండువేల కిలో మీటర్ల దూరంగా ఉన్న రష్యా నగరాలపై నిమిషాల వ్యవధిలో దాడి చేయగలవు. బెర్లిన్-మాస్కోల మధ్య దూరం 1600కిలో మీటర్లు మాత్రమే. వీరు జర్మనీలో దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణులను కూడా నాటో జర్మనీ కమాండ్ ద్వారా స్థాపిస్తారు. ఈ హైపర్‌సోనిక్ క్షిపణులు భూ వాతావరణానికి పై అంచున గంటకు 3,800 మైళ్లకు పైగా ప్రయాణించగలవు. ఈ క్షిపణులు ఎగిరేసమయాన క్షిపణుల రక్షణవ్యవస్థ పరిధికి మించి ఉంటాయి. మాస్కో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లపైనే గాకుండా రష్యాలోని అన్ని పెద్ద నగరాలతోపాటుగా యూరో ఆసియా దేశాలపై కూడా గురిపెట్టగలవు.

జర్మనీ ఛాన్సలర్ షోల్జ్ దీన్ని మాత్రం జర్మనీ రక్షణ వ్యవస్థను పటిష్టపర్చుకోటానికేనని సమర్థించుకున్నాడు. 2023 సంవత్సరంలో యూరప్, కెనడా, అమెరికాలోని నాటో దేశాలు 8శాతం రక్షణవ్యయం పెంచాయి. 2024నాటికి ఈ వ్యయం 18శాతం పెరుగుతుందని అంచనా. రానున్న 5సంవత్సరాలలో నాటో మిత్రదేశాలు 650 ఐదవతరం(జనరేషన్) ఎఫ్-35 యుద్ధ విమానాలను, 1000కిపైగా వాయు రక్షణ వ్యవస్థలను, దాదాపు 50యుద్ధ నౌకలతోపాటు జలాంతర్గాములను, 1200 యుద్ధ ట్యాంకులు, 11,300 యుద్ధవాహనాలతోపాటుగా దాదాపు 2వేల ఫిరంగి వ్యవస్థలను అదనంగా సమకూర్చుకుంటాయి. వీటన్నింటికి అవసరమయ్యే వేల కోట్ల డాలర్ల వ్యయాన్ని సామాన్యులపై పన్నులరూపంలో భారం మోపనున్నారు. తద్వార యుద్ధరంగ పరిశ్రమలు వందలాదికోట్ల డాలర్లను తమ లాభాల ఖజానాలో జమ వేసుకోవాలి. ఇప్పటికే నాటో దేశాలు రష్యాపై వైమానికదాడి చేయడానికి ఈ వేసవిలో 100వరకూ

ఎఫ్-16 యుద్ధ విమానాల్ని పంపించుటకు సన్నాహాలు చేస్తున్నాయి. లోగడ అబ్రహాం, లియోపార్ట్ యుద్ధ ట్యాంకర్లతో రష్యాపై దాడిచేసి రష్యాను ఓడిస్తామని ప్రగల్భాలు పలకగా రణక్షేత్రంలో తుప్పు డబ్బాలుగా రష్యా వాటన్నిటినీ మార్చి నాటో, ఉక్రెయిన్‌లకు ఘోరపరాభవాన్ని చవిచూపింది.

రష్యాకు వ్యతిరేకంగా నాటో ఏ నిర్ణయం తీసుకున్నా సమర్థవంతంగా తిప్పికొడతామని, మాస్కో నిశితంగా పరిస్థితులను విశ్లేషించి నాటోకు తగిన గుణపాఠం చెబుతామని రష్యా విదేశాంగ డిప్యూటీ మంత్రి సెర్గీ ర్యాబ్కోన్ అన్నారు. రష్యా నుండి ముప్పు వాటిల్లుతుందని తరచూ ప్రచారంచేసే నాటో దేశాలు తమ బలాబలాలు గురించి ప్రజలకు చెప్పాలన్నారు. రష్యా సైనికులు 13లక్షలు ఉండగా, నాటో దేశాల బలం 33లక్షల సైనికులతో 90కోట్ల నాటో ప్రజల జనాభా ఎక్కడ, 14.4కోట్ల రష్యా జనాభా ఎక్కడ అని ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ రాసింది. రష్యా సరిహద్దు చుట్టూ నాటో దేశాల ట్రూపులు, యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు మోహరించి ఉన్నాయిగానీ, రష్యా మిలిటరీ నాటో దేశాల సరిహద్దులకు వెళ్లలేదని అనేక సందర్భాలలో పుతిన్ హెచ్చరించారు.

మరొకవైపు ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో చైనా-ఉత్తరకొరియా- రష్యాలకు వ్యతిరేకంగా నాటో కూటమిని విస్తరించే యోచనలో అమెరికా ఉంది. అందుకోసం, దక్షిణకొరియా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిలిప్పైన్స్, వియత్నాం దేశాలు కలిసివస్తాయని అమెరికా ఆశిస్తుంది. మన దేశాన్ని కూడా బుజ్జగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇండియా, జపాన్‌లతో కలిసి అమెరికా క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ (క్వెఎస్‌డీ) మిలిటరీ సహకార కూటమిని స్థాపించింది.

నాటో యుద్ధకూటమి చైనాను కూడా లక్ష్యంగా చేసుకొని 75వ శిఖరాగ్ర సమావేశంలో చైనా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యాకు సహకరించిందని ఆరోపించింది. ఈ ఆరోపణలకు మద్దతుగా ఆసియా-పసిపిక్‌లో యుద్ధవాతావరణాన్ని సృష్టించడానికి తద్వారా నాటోను అక్కడ వ్యాప్తిచేయడానికి ప్రణాళికలను రచిస్తున్నది. 'ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రచ్ఛన్న యుద్ధ వాంఛనలను ఆచరణలో ఉంచటానికి ప్రయత్నించకండి' అని తీవ్ర స్వరంలో అమెరికాను చైనా హెచ్చరించింది.

నాటో మొదటి జనరల్ సెక్రటరీ లార్డ్ హేస్టింగ్స్ చెప్పినట్లుగా 'అసలు నాటో కూటమి సోవియట్ యూనియన్‌ను దూరంగా ఉంచటానికి' 1949లో సృష్టించారు. 1991 సోవియట్ యూనియన్ పతనం తర్వాత నాటో కూటమిని రద్దుచేసి ఉండాలి. కానీ ఆ తర్వాత తూర్పు యూరప్‌కు, (ఒకప్పటి సోషలిస్టు దేశాలకు) నాటో విస్తరించింది. తూర్పువైపునకు ఒక్క అంగుళం కూడా విస్తరించనని అమెరికా ఒప్పుకొని జంటిల్‌మెన్ ఒప్పందాల్ని ఉల్లంఘించింది. అమెరికా సామ్రాజ్యవాదం ఇప్పుడు 'నార్త్ అట్లాంటిక్'కు దూరంగా విస్తరిస్తూ క్షిపణులను మోహరిస్తూ, యుద్ధాలను చేస్తూ, ప్రోత్సహిస్తూ ఆయుధ వ్యాపారకోసం ప్రపంచశాంతిని పణంగా పెడుతుంది. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకు లాభార్జన ముఖ్యం! ప్రజల ప్రాణాలు, పర్యావరణ రక్షణ కానేకాదు. ఉక్రెయిన్ శాంతి చర్చలకు పూనుకోదు, గాజాలో మారణకాండను ఆపదు. కానీ ప్రపంచశాంతికోసం సామ్రాజ్యవాదం కట్టుకథలు వల్లిస్తుంది. ప్రచ్ఛన్న-ప్రత్యక్ష యుద్ధాల్ని ప్రేరేపిస్తుంది.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
సెల్: 9849491969

వరమిచ్చేదెవరు?

చింతపట్ల సుదర్శన్

కుయ్యోవ్...మొర్రోవ్ అంటున్నది పాత ఇంటి అరుగు మీద డాగీ. అప్పటికే సగం నిద్రలోకి జారుకున్న డాంకీ ఉలిక్కిపడింది. నిద్ర చెడి, చికాకుపడి అడిగింది. ఏమిటి 'బ్రో' ఎందుకా కుయ్యో మొర్రోవ్‌లు. ఏమిటి ప్రాబ్లం అని.ఏం చెప్పనన్నా ఎన్నికల్లో గెలిచిన ఓ కాండేటు సంబరాలు చేసుకుంటున్నాడు. సరదాగా చూద్దామని వెళ్లా. సనాతన ధర్మం పార్టీ మనిషే కదా చక్కెర పొంగలి చిక్కదా అనుకున్నా. కానీ అక్కడ సీనే వేరు. వారెవ్వా క్యా సీన్ హై అనిపించింది. ఏమిటో ఆ సీను మాకూ చూపించ రాదూ అంది డాంకీ. ఏం చెప్పను. జనం క్యూలో నిలబడున్నారు. రాములల్లా దర్శనానికేమోననుకున్నా. కాదు. ఆ గెలిచిన ఆసామి వందల కేసుల బీర్లూ, అన్ని కేసుల మందూ పంచి జనానికి పండుగ చేశాడనుకో. ఇందులో ఆశ్చర్యపడాల్సిందేముంది. ఎలెక్షన్‌లకు ముందు మందు సీసాలు పంచి ఉంటాడు. మందు పుణ్యం వల్లనే కదా గెలిచామని మరొక్కసారి జనానికి మందు కొట్టించి థాంక్స్ చెప్పుకుని ఉంటాడు, ఇంతకీ కుయ్యో మొర్రోల సంగతి చెప్పనేలేదు అంది డాంకీ. ఏం చెప్పను సీసా అందిన వాడో అందుతుందో లేదో అని ఆదుర్దాగా పరుగెత్తిన వాడో నా తోక తొక్కి పోయాడు. ఒకటే నొప్పి. నొప్పి...నొప్పి... అంటూ డాగీ కుయ్యో మొర్రోవులు కంటిన్యూ చేసింది. అరెరే ఎంత పనయింది. నొప్పి తగ్గడానికి టాబ్లెట్లుంటాయి కాని మనకెవడిస్తాడు. పశువుల ఆసుపత్రికి వెళ్తే యజమాని కుక్కలకూ, గాడిదలకూ మందివ్వరు. మనుషులకు ఆరోగ్యశ్రీ

రంగస్థలం

పథకం ఉన్నది కాని మనకు ఏ పథకాలూ లేవుకదా అని నిట్టూర్చింది డాంకీ. అవును బ్రో అప్పుడెప్పుడో ఎవడో ఇలాగే నా తోక తొక్కితే తిక్కరేగి శాపం పెట్టాను. ఈసారి మరో పార్టీ గెలిచింది చూశావా నా తడాఖా. ఈసారి ఈ పార్టీకి శాపం పెట్టానా...గోవిందా గోవిందే. ఫక్కుమని నవ్వింది డాంకీ. పిల్లి శాపాలకు ఉట్లు తెగవు అన్న సామెత విన్నాను కానీ కుక్క శాపం అన్నమాట ఎప్పుడూ వినలేదు అంది డాంకీ. నీకు తెలీదు 'బ్రో' ఈ మనుషుల సంగతి. ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న, ఓడ దిగాక బోడి మల్లన్న అంటారు. ప్రజలు ఓట్లేస్తే గెలిచి అంతా తమ ఘన కార్యమేనని ఒళ్లు తెలీకుండా నీల్గుతారు. వీలైతే తెగ్గోస్తారు కూడా. అందుకే వీళ్లను శపించాలి అంది డాగీ. పిల్లి శాపాలకూ, కుక్కల కుయోవ్‌లకూ, రాజకీయాలకూ సంబంధం లేదోయ్. ఈ ఓటర్లున్నారు వీళ్ల సైకాలజీ ఎవళ్లకీ అర్థం కాదు. తల్చుకుంటే అమాంతం ఆకాశానికి ఎత్తేస్తారు. లేకపోతే పాతాళానికి తొక్కేస్తారు అంది డాంకీ.

నేను ఒప్పుకోను డాంకీ భయ్యా! ఓటర్లు మందుకు, డబ్బుకు మాత్రమే ఓట్లేస్తున్నారని, పుణ్య పురుషులకు కాదని విన్నాను అంది డాగీ తోకకేసి దిగులుగా చూసుకుంటూ. అలాగనకు మన వాళ్ల నిజాయితీ నిప్పులాంటిది సుమా! ఎవర్నీ కాదనలేక మొహమాటంగా అందరి దగ్గరా తీర్థంపుచ్చుకుని, ప్రసాదంగా డబ్బు అందుకుని తాము ఎవరికి వెయ్యాలనుకున్నారో వారికే వేస్తున్నట్టున్నారు ఓట్లు. ఓట్లు పడ్డం కొందరి సీట్లకి చిల్లులు పడ్డం జరిగినా ఇంకా ఆ టాపిక్ వదల్లేదా మరో ఐదేళ్ల ఆగలేరా, కళ్లు మూసుకుంటే ఇట్టే అయిపోతాయని ఓ జగమెరిగిన వాడు కూయలేదా అంటూ అరుగెక్కాడు అబ్బాయి. ఓట్ల జాతర అయిపోయినా సీట్ల జాతర మళ్లీ ఓట్ల దాకా ఉండేదే కదన్నా. ఇక ఓడిపోయిన వాళ్లు తాము జార్చుకున్న సీట్ల వంక చొంగకారుస్తూ కూచునే ఉంటారు కద అంది డాగీ మాటల్లో పడితే తోక బాధ మరిచిపోవచ్చుననే ఆశతో. నువ్వన్నది నిజమే. గోతికాడ నక్కల్లా పొంచి ఉండి, సీటెక్కిన వాడి తప్పులు వెదకడం, లెక్కలు రాయడం, తాము చేసింది, పొడి చేసింది ఎవడూ చెయ్యలేదని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించడం ఇవే కదా చేసేది ఓడిన వాళ్లు అన్నాడబ్బాయి. గెలిచిన వాళ్లకు మాత్రం సుఖం ఎక్కడిది. ఆరునెలల్లో కూలబడతారని, రాలిపడతారని చిలక జోస్యాలు, రాశి ఫలాలూ చెప్తూనే ఉంటారు కదా చెప్పేవాళ్లు. ఇదొక వైపైతే ఉన్నవాళ్లను గట్టిగా వాటేసుకుని, ఎదుటి పార్టీ వాళ్లని ఎందుకైనా మంచిది అని తమ వేపు లాక్కుని ప్రతిపక్షం అనేదే లేకుండా చేస్తేనే కద అయిదేళ్లూ ప్రశాంతంగా నిద్రపోవచ్చు గెలిచినవాళ్లు. అందుకే కద ఫిరాయింపులు, ఫిరాయింపులు ముదిరితే విలీనాలు అన్నాడు అబ్బాయి. ఎక్కడి నిద్ర. ఓడిన వాడికి ఓడినందుకు నిద్ర కరువు. గెలిచిన వాడికి గెలిచినందుకు నిద్ర కరువు. పార్టీలో పనిలేని వాళ్లందరూ కృష్ణా రామా అని భజన చేసుకుంటూ ఉండరు కద. ఏదో ఓ హోదా లేకుండా ఊపిరి ఆడదు కద అంది డాగీ. అందుకే గదా గవర్నరు గిరీలు, నామినేషన్ పదవులు, సలహాదార్ల కొలువులు. పార్టీలో ఉన్నవాళ్ల కడుపు కొట్టవద్దు. పార్టీలోకి వచ్చిన వారి కడుపు నింపకుండా ఉండద్దు. అందరి వైభోగాలూ వెలగడానికి ప్రజల సొమ్ము ఉండనే ఉంది. ఆ పైన అప్పుల కుప్పలు ఉండనే ఉన్నాయి. అవీ ఆర్చేదీ తీర్చేదీ ప్రజలే కద అన్నాడు అబ్బాయి. ఇప్పుడు గెలిచిన మత్తు తలకెక్కి ఉచితంగా తాగిన మందు కైపెక్కి, నా తోక తొక్కినవాడు వచ్చే ఎలక్షన్లల్లో ఓడిపోవాలి అంది డాగీ.

ఇదివరకైతే ఓడిన వారు, మత్తు దిగినవారు, ఓదార్పు యాత్రలు, పాద యాత్రలు చేసేవారు. ఇప్పుడింకేదైనా కొత్త యాత్ర కనిపెట్టి నీ శాపం నిజం చేస్తారేమో అన్నాడు అబ్బాయి. నీ శాపం కంటే ప్రజలిచ్చే వరం గొప్పది. వాళ్లకు పనికొచ్చే పనులు చేసిన వారికే వరమిస్తారు వాళ్లు అన్నది డాంకీ.

కిసాన్ రైల్ ఏమైంది?

అరుణ్‌కుమార్ శ్రీ వత్సవ

అనేక ప్రాజెక్టులను అట్టహాసంగా ప్రారంభించి ఆ తర్వాత వాటిని మరిచిపోవడం ప్రధాని నరేంద్రమోదీకి బాగాఅలవాటైంది. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను సిద్ధం చేయకుండానే హడావుడిగా ప్రారంభించడం కూడా మనం చూడవచ్చు. 2019-20 బడ్జెట్‌లో కిసాన్ రైల్ పథకాన్ని ప్రకటించారు. 2020లో మొదటి రైలును ప్రారంభించారు. ఇప్పుడీ ప్రాజెక్టు ఏస్థాయిలో ఉందో వెతుక్కోవలసిందే. త్వరగా పాడైపోయే పండ్లు, కూరగాయలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి కిసాన్ రైల్ పథకం ప్రారంభించారు. రైతులకు మేలు జరిగే ఈ పథకం గురించి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడంలేదు. కిసాన్‌రైలు సేవలు ఎలాఉన్నాయన్న అంశం గురించి 2023 మార్చి 29 రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. 2020 ఆగస్టు 7న కిసాన్‌రైలు సర్వీసు ప్రారంభించి 2023 మార్చి ఒకటవతేదీ నాటికి 167 రూట్లలో దాదాపు 2,364 రైల్వే సర్వీసులను నడిపిందని పార్లమెంటులో తెలియజేశారు. పండ్లు, కూరగాయల రవాణాను ప్రోత్సహించడానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వశాఖ రవాణా సబ్సిడీ కింద 50శాతం అందించిందని మంత్రి వెల్లడించారు. 2020-21, 2021-2022 ఆర్థిక సంవత్సరాలలో సబ్సిడీలను అందించారు. మొదటి సంవత్సరంలో రు.27.79కోట్లు, రెండో సంవత్సరంలో రు.121.86 కోట్లు అందించింది. ఆ తర్వాత సంవత్సరం రు.50కోట్లు మాత్రమే ఇచ్చింది. 2022 ఏప్రిల్ 1 నుంచి సబ్సిడీని రద్దు చేసింది. సబ్సిడీ ర్దుచేయడమేగాక రైల్వేలు పాక్షికంగా మద్దతిస్తున్నాయి. 2021 ఏప్రిల్ 1 నుంచి, 2023 మార్చి 1వ తేదీ మధ్యకాలంలో కేవలం రు.4కోట్లు మాత్రమే రైల్వేలు సబ్సిడీగా ఇచ్చాయి.

ఆకస్మికంగా సబ్సిడీ రద్దుపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. ఈ పథకం ప్రారంభించడానికి ముందు తగినంతగా క్షేత్రస్థాయి ఏర్పాట్లు జరగకపోవడం కారణం అని నిపుణులు చెప్తున్నారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువగా రోడ్డు మార్గం ద్వారానే రవాణా చేస్తున్నారు. పొలాలనుంచి తరలించడానికి వివిధరకాల వాహనాలు వినియోగిస్తున్నారు. అయితే దేశంలో వివిధప్రాంతాలకు పండ్లు, కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేయడానికి రైల్వేల

ద్వారా అయితే ఖర్చు తక్కువగా ఉంటుందని రైతులు ఆశించి, ఈ విధానాన్ని అనుసరించారు. అయితే కిసాన్‌రైలు పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసి రైతులను నిరాశ పరిచింది. అంతేకాదు, టిక్కెట్ల భారం పెంచే రైళ్లను ప్రవేశపెట్టి సామాన్యప్రజలకు రైలు ప్రయాణం అందకుండా చేశారు. సాధరణ బోగీలను బాగా తగ్గించారు. వస్తు రవాణాను ఉదాహరణకు మహారాష్ట్ర నుంచి దూరంగా ఉన్న బీహార్‌కు లేదా పశ్చిమబెంగాల్ పంపడానికి రోడ్డు మార్గం కంటే రైలుద్వారా పంపడానికి ఖర్చు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే రైతులు తగినరీతిలో అధికారులను సంప్రదించడంలేదని ఆరోపణలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం రైతు సంఘాలు, సహకార సొసైటీలతో సంప్రదించి కనీసం దూరప్రాంతాలకైనా వస్తు రవాణా కొనసాగించవచ్చు. రవాణాకు రైతులు సబ్సిడీలమీద ఆధార పడకూడదని వాదించేవాళ్లున్నారు. వాణిజ్యపరంగా మేలుగా ఉంటే ఈ పతకం విజయవంతమయ్యేదని కూడా చెప్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలోనే లోపాలున్నాయని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కిసాన్‌రైలు పథకం విఫలమై ఆధునిక వ్యవసాయం గణనీయంగా వెనుక పట్టుపట్టింది. నిపుణుల కమిటీ ఈ ప్రయోగంపై సమీక్షించి మరింత సమర్థవంతమైన అమలు వ్యూహాన్ని సిఫారసుచేసి ఉండవలసింది. సరైన క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలను రూపొందించి ఉండవలసిందని కొందరు చెప్తున్నారు. అలాగే కృషి ఉడాన్ పథకాన్ని అక్టోబరు 2021 ప్రారంభించారు. కొండ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, గిరిజన ప్రాంతాల నుంచి పండ్లు, కూరగాయల రవాణాకు ఈ పథకం ఉద్దేశించింది. కిసాన్ ఉడాన్ పథకం వ్యవసాయరంగం వృద్ధికోసమే ప్రవేశపెట్టారు. రైతులు దేశవ్యాప్తంగా వస్తువుల రవాణాకు విమానాలను కూడా ఉపయోగిస్తున్నారు. అయితే ఈ పథకం ప్రజలకు అంతగా తెలియని పరిస్థితిఉంది.

అది మోసిన బోయి లెవరోయ్...!

పోతుల బాలకోటయ్య

'ప్రభువెక్కిన పల్లకి కాదోయ్..., అది మోసిన బోయిలెవరోయ్....' అంటారు మహాకవి శ్రీశ్రీ. ఇది తరాలకు, యుగాలకు వర్తించే మాట. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు సదా గుర్తుపెట్టుకోవాల్సిన అతి ముఖ్యమైన మాట కూడా ఇదే. సాధారణంగా ఈ పదాన్ని చాలా మంది రాజకీయ నాయకుల పెదాలపైనే పలికిస్తుంటారు. మనస్ఫూర్తిగా తీసుకోరు. కార్యకర్తలే మా పార్టీకి రక్తం, గుండె అంటూ దేహంలో ఉన్న అన్ని అవయవాలతో పోలుస్తుంటారు. 'వీరు లేనిదే పార్టీ లేదు, నేనూ లేను' అంటూ చప్పట్లు కొట్టిస్తారు. తీరా అధికారంలోకి రాగానే, 'ఓడ దాటే దాక ఓడ మల్లన్న, ఓడ దాటాక బోడి మల్లయ్య' అన్న సామెతను గుర్తుకు తెస్తారు. కార్యకర్తలు అపాయింట్‌మెంట్లకోసం మెట్ల దగ్గర క్యూ కడుతుంటారు. గుమ్మాల దగ్గర పడి గాపులు పడుతుంటారు. చచ్చీ చెడి కలిస్తే, ఒక ఫోటోతోనో, సెల్ఫీతోనే సరిపెట్టి పంపిస్తుంటారు. మళ్ళీ ఎన్నాళ్ళకో.... ఏమిటి? అని ఎవరైనా 'సాహసం' చేసి ప్రశ్నిస్తే, 'సార్' బిజీ అంటారు. ఈ బిజీ రెండేళ్ళు పట్టొచ్చు. మూడేళ్ళు పట్టొచ్చు. ఐదేళ్ళు పట్టొచ్చు. పుణ్యకాలం కాస్త పూర్తి కావచ్చు. నా అనుభవంలో ఒక మాటను ఇక్కడ తప్పక చెప్పాలి.

రాష్ట్రవ్యాప్తంగా దళిత ఉద్యమంలో భాగంగా నేను రెండేళ్ళ క్రితం కందుకూరు వెళ్ళాను. అక్కడ తెలుగుదేశం పార్టీకి చెందిన 65 ఏళ్ళ దళిత కార్యకర్త ఒకరు కలిశారు. ఆయన కీ.శే. ఎన్టీఆర్ ప్రేరణతో 1983 నుంచి అదే జెండా రంగును ఒంటిపై ధరిస్తుంటారు. తాను చంద్రబాబు కంటే తెలుగు దేశం పార్టీలో సీనియర్‌ని అని చెప్పారు. ఆ పెద్దాయన నన్నొక కోరిక కోరారు. 'నాకు చంద్రబాబుతో ఫోటో దిగాలని ఉంది. ఆ ఫోటో నా ఇంటిలో పెట్టుకున్న తర్వాత చని పోవాలని ఉంది అన్నాడు. నాకు ఆశ్చర్యంతోపాటు ఆ పార్టీపై కోపం వచ్చింది. ఇన్నేళ్లైనా ఇంత చిన్నకోరిక తీరలేదా? అన్నాను. తీరలేదు, మీరైనా తీర్చండి అన్నాడు. పార్టీలకోసం పొలాలు అమ్మినోళ్ళు, ప్రాణాలు ఇచ్చినోళ్ళు నాకు తెలుసు. ఫొటోకోసం ఎదురు చూస్తున్న వారు కూడా ఉంటారని తలపుకువస్తే తనువు జలదరించింది. సొంత

డబ్బులతో, సొంత శ్రమతో కుటుంబ జీవితాన్ని పక్కకు నెట్టి నాయకుడిపైనో, పార్టీపైనో ఉన్న ప్రేమతో జీవితాలను త్యాగంచేసి కార్యకర్తలు పనిచేస్తుంటారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యే, మంత్రి వంటి నాయకులు మెడలో కండువాలు పదే పదే మార్చినా, కార్యకర్తలు మాత్రం మార్చరు. నమ్మిన పార్టీని అంటిపెట్టుకునే ఉంటారు. నాయకులు మాత్రమే 'తెప్పలుగా చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు' అన్నట్లు తక్కెట్లో నుంచి అటు, ఇటు దూకుతారు. ఇలా దూకి వచ్చిన వారే మళ్ళీ మళ్ళీ పదవుల్లో రాణిస్తారు. పార్టీలను నమ్మి బాగుపడ్డ నాయకులు ఉన్నారు. కానీ, నష్టపోని, మోసపోని కార్యకర్తలు లేరు అంటే అతిశయోక్తి కాదు. ఎన్నికల ప్రక్రియలో పార్టీ గెలుపుకు ముఖ్య కారణం కార్యకర్తలే. వీళ్ళు చెట్టుకు వేళ్ళు లాంటివాళ్ళు. కొమ్మలు, రెమ్మలు చిగురించాయి అంటే కారణం వేళ్ళ బలమే. ఒక రాజకీయ పార్టీని ఇలా బొట్టుపెట్టి, కాటుక దిద్ది విమర్శలు చేయటం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. అందరికీ, అన్ని రాజకీయ పార్టీలకూ వర్తిస్తుంది. బోయిలు అన్ని చోట్ల ఉంటారు. ఉన్నారు. ఇలా కార్యకర్తలను మర్చిపోయినప్పుడు ఆయా పార్టీల జండా రంగులు కూడా వెలిసిపోతుంటాయి. అధికారం కూడా కోల్పోతుం టాయి. వర్తమాన రాజకీయాల్లో అన్ని పార్టీలలో బోయిలు ఎక్కువగా కనిపించటం సాంప్రదాయంగా మారిపోయింది.

అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

చినుకుతో వణుకు!

- జనజీవనం అస్తవ్యస్తం
- రవాణాకు అంతరాయం
- గ్రామాలను ముంచెత్తిన వరద
- నిరాశ్రయులైన కుటుంబాలు
- శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులు
- జలసవ్వడుల్లో చిక్కుకున్న పర్యాటకులు

వరుణుడు విజృంభిచాడు. గత కొద్దిరోజులుగా తన ప్రతాపాన్ని చూపుతూ కుటుంబాలను చిగురుటాకుగా వణికిస్తున్నాడు. ప్రకోపానికి నదులు, వాగులు, వంకలు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. జనజీవనం స్థంభించింది. రవాణావ్యవస్థ అతలాకుతలమైంది. రహదారులు నదులను తలపిస్తున్నాయి. కొండచరియలు విరిగిపడడంతో ప్రజలు మృత్యువాతపడుతున్నారు. వందలాది కుటుంబాలు సహాయక శిబిరాల్లో తలదాచుకున్నాయి. జల సవ్వడులను ఆస్వాదించేందుకు వెళ్లిన కొందరు పర్యాటకులు వరద ఉధృతికి చిక్కుకుని బతుకుజీవుడా అని బయటపడ్డారు. రెండుమూడు రోజుల పాటు దేశవ్యాపంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

న్యూదిల్లీ: గతంలో ఎన్నడూ లేనివిధంగా చినుకు వణికిస్తోంది. భారీ వర్షాలతో భారత్ అతలాకుతలమౌతోంది. దీనికితోడు ఉపరితల ఆవర్తనం, రుతుపవనాలు వ్యాపించడంతో వర్షాలు దంచికొడుతున్నాయి. ఉత్తర, దక్షిణాది, ఈశాన్య, పశ్చిమ రాష్ట్రాలు అన్న తేడాలేకుండా వరద బీభత్సం సృష్టించడంతో నదులు, వాగులు, వంకలు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, సిక్కిం, బీహార్, కర్నాటక, కేరళ, గోవా, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాతో సహా అన్ని రాష్ట్రాల్లోనూ ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. వాగులు, వంకలు కట్టలు తెంచుకుని గ్రామాలను ముంచెత్తడంతో వేలాది ఇళ్లు నేలమట్టం కావడంతో ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడడంతో భారీ సంఖ్యలో ప్రజలు, ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా వరద నీరు చుట్టుముట్టడంతో వందలాది కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారులు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రుల్లోకి వరదనీరు చేరడంతో విద్యార్థులు, రోగులు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాలో సరయూ నది వరదల కారణంగా వందలాది గ్రామాలు నీట మునిగాయి. ప్రజలు వరదల బారిన పడ్డారు అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. వరద బాధితులకు ఆహారం, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా నేపాల్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా నది నీటిమట్టం ప్రమాద స్థాయి కంటే 20 సెంటీమీటర్ల మేర పెరగడంతో సమీప 15 గ్రామాల్లోని ఇళ్లలోకి నీరు చేరిందని అధికారులు వెల్లడించారు. ఆయా కుటుంబాలకు చెందిన వారు సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అధికారులు వైద్య సేవలను కూడా అందుబాటులో ఉంచారు. ఉత్తరాఖండ్‌లో సోమవారం కొండచరియలు విరిగిపడడంతో రవాణా వ్యవస్థకు అంతరాయం కలిగింది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ మహానగరాలు కుండపోత వర్షంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. రహదారులు నదులు, జలాశయాలను తలపిస్తున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో మహారాష్ట్రలోని అంజనేరి జలపాతం వద్దకు వెళ్లి కొందరు పర్యాటకులు వరద తీవ్రతకు అక్కడ చిక్కుకుపోయారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంజనేరి జలపాతం వద్ద ప్రవాహం పెరిగింది. దీంతో జల సవ్వడులను ఆస్వాదించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు అక్కడికి వెళ్లారు. అదే సమయంలో అకస్మాత్తుగా వర్షం పడి వరద మరింత పెరిగింది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు శ్రమించి పర్యాటకుల్ని సురక్షితంగా అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన భయానక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. భారీ వర్షాలకు ఈదురు గాలులు తోడుకావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. కేరళ, గోవా, మహారాష్ట్ర, ఒడిశా, మేఘాలయ, అస్సాం, పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, కర్నాటకతో సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో స్కూళ్లు, కాలేజీలు సహా అన్ని విద్యా సంస్థలకుసెలవులు ప్రకటిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆగ్నేయ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ. ఈదురు గాలులతో అక్కడక్కడ తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. చాలా జిల్లాల్లో ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాగల ఐదు రోజులపాటు ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనంతోపాటు షియర్ జోన్ ఏర్పడిందని ఈ ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈనెల 16 వరకు అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, గోవా, మహారాష్ట్ర, కేరళ, కర్నాటకలోను 17, 18న ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

30 ఏళ్ల తరువాత తెరుచుకున్న ఆలయం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ రాష్ట్రం అనంత్‌నాగ్ జిల్లాలో 30 ఏళ్ల తర్వాత ఉమా భగవతీదేవి ఆలయాన్ని కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ సమక్షంలో తెరిచినట్లు అధికారులు తెలిపారు. పునరుద్ధరణ పనుల తరువాత ఆలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. తొలిరోజు అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన ఉమాదేవి విగ్రహాన్ని మంత్రోచ్ఛారణల నడుమ గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఆలయ పునరుద్ధరణపై స్థానికులు, కశ్మీరీ పండితులు, ముస్లింలు సంతోషం వ్యక్తం చేశారు. 'గుడి అభివృద్ధికి పండిట్ సోదరులకు సాయం చేసేందుకు అన్నివిధాలా సిద్ధంగా ఉంటాం' అని స్థానికుడు గుల్జార్ అహ్మద్ అన్నారు. 34 ఏళ్ల తర్వాత ఆలయం ప్రారంభం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. 1990లో కూల్చివేసిన ఉమా భగవతి అమ్మవారి ఆలయం పునరుద్ధరణ జరిగినట్లు కేంద్రమంత్రి రాయ్ తెలిపారు.

డీకేకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

న్యూదిల్లీ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేసేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను సుప్రీంకోర్టులో డీకే సవాలు చేశారు. దీనిని సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ... కర్నాటక హైకోర్టు ఆదేశాల్లో తాము జోక్యం చేసుకోవడం లేదని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీబీఐ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ డీకే వేసిన పిటిషన్‌ను 2023 అక్టోబర్ 19న కర్నాటక హైకోర్టు తోసిపుచ్చింది. కేసు విచారణను పూర్తి చేసి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న డీకే 2013-2018 మధ్య ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని సీబీఐ ఆరోపించింది. దీనిపై 2020 సెప్టెంబర్ 3న సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. 2021లో ఈ ఎఫ్‌ఐఆర్‌ను హైకోర్టులో డీకే శివకుమార్ సవాలు చేశారు

పరారీలో పూజా ఖేద్కర్ తల్లిదండ్రులు

పుణె: రైతులను తుపాకీతో బెదిరించిన కేసులో ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమా ఖేద్కర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మనోరమతోపాటు ఆమె భర్త దిలీప్ ఖేద్కర్‌ను అరెస్ట్ చేసేందుకు పుణె పోలీసులు చర్యలు చేపట్టారు. అందుకోసం పుణెలోని దిలీప్ ఖేద్కర్ నివాసానికి సోమవారం పోలీస్ బృందాలు చేరుకున్నాయి. అయితే ఇంటికి తాళం వేసి ఉండడంతో ఆ బృందాలు వెనుతిరిగాయి. పుణెలో పోలీస్ ఉన్నతాధికారులు మాట్లాడుతూ పూజా తల్లిదండ్రులు పరారీలో ఉన్నారన్నారు. వారిని సంప్రదించడానికి ప్రయత్నించామని, కానీ వారి ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లుగా సమాధానం వస్తుందన్నారు. ఈ కేసులో ఖేద్కర్ కుటుంబం విచారణకు సహకరించడం లేదని పుణె పోలీసులు పెదవి విరిచారు. పుణె పరిసర ప్రాంతాలతోపాటు వారి ఫార్మ్‌హౌస్‌ల్లో సైతం గాలిస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే.. వారు చెప్పే సమాధానం ఆధారంగా మనోరమా ఖేద్కర్, దిలీప్ ఖేద్కర్‌పై తదుపరి చర్యలు ఉంటాయని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

కన్నడ స్టార్ హీరో రక్షిత్ శెట్టిపై కేసు

బెంగళూరు: కన్నడ స్టార్ హీరో రక్షిత్ శెట్టిపై కేసు నమోదైంది. రక్షిత్ శెట్టి హీరోగా బ్యాచిలర్ పార్టీ అనే సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో తన పాటలను కాపీ చేసి రక్షిత్ తన సినిమాలో పెట్టుకున్నారంటూ నవీన్ కుమార్ అనే వ్యక్తి కేసు పెట్టారు. బ్యాచిలర్ పార్టీ అనే చిత్రంలో పాటల కోసం ముందుగా ఎంఆర్‌టీ మ్యూజిక్ కంపెనీలో పనిచేస్తున్న నవీన్ కుమార్‌తో చర్చలు జరిపారు. అయితే ఆ చర్చలు విఫలమయ్యాయి. గాలిమాతు, న్యాయ ఎల్లిడి అనే పాటలు సినిమాలో ఉపయోగించారు. సినిమా రిలీజ్ అయిన తరువాత ఆ రెండు పాటలు హిట్ అయ్యాయి. తమ అనుమతి లేకుండా తమ పాటలను సినిమాలో ఎలా ఉపయోగిస్తారని ఆరోపిస్తూ రక్షిత్ శెట్టికి చెందిన పరమవా స్టూడియోస్‌పై, అతనిపైన నవీన్ కేసు పెట్టారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పుడు కాపీరైట్ వివాదంలో చిక్కుకున్న రక్షిత్ శెట్టి తన టీమ్‌తో ఆ మ్యూజిక్ సంస్థతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కానీ ఈ కేసుపై కానీ, కాపీ ఆరోపణలపై కానీ రక్షిత్ ఇప్పటివరకు స్పందించలేదు.

రెండు రోజులు లిఫ్ట్‌లో వృద్ధుడు

తిరువనంతపురం: కేరళలో ఓ వ్యక్తికి భయానక అనుభవం ఎదురైంది. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లిన ఆ వ్యక్తి ప్రమాదవశాత్తూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. అయితే, రెండు రోజుల తర్వాత ప్రాణాలతో బయటకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉళ్లూరు ప్రాంతానికి చెందిన 59 ఏళ్ల రవీంద్రన్ నాయర్ గత శనివారం మెడికల్ చెకప్ కోసం తిరువనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి వెళ్లారు. అవుట్ పేషెంట్ బ్లాక్‌లోని మొదటి అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. సరిగ్గా అదే సమయంలో ఎలివేటర్‌లో సమస్య తలెత్తి ఒక్కసారిగా ఆగిపోయింది. లిఫ్ట్ బలంగా ఊగడంతో రవీంద్రన్ ఫోన్ కిందపడి పగిలింది. దీంతో తాను చిక్కుకుపోయినట్లు ఎవరికీ చెప్పే అవకాశం కలగలేదు. లోపలి నుంచి సాయం కోసం అరిచినా ఎవరికీ వినబడకపోవడంతో అతడు ఇరుక్కుపోయిన సంగతి ఎవరికీ తెలియలేదు. సోమవారం ఉదయమే లిఫ్ట్‌లో ఓ మనిషి చిక్కుకుపోయాడని గుర్తించారు. ఈ ఉదయం లిఫ్ట్ ఆపరేటర్ రొటీన్ వర్క్ కోసం ఆసుపత్రికి వచ్చారు. అప్పుడు అది పనిచేయడం లేదని గుర్తించి రిపేర్ చేసి లిఫ్ట్ డోర్ తెరవగా అందులో రవీంద్రన్ స్పృహతప్పి కన్పించాడు. వెంటనే అతడికి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది. లిఫ్ట్ పని చేయని విషయాన్ని ఆసుపత్రి సిబ్బంది గుర్తించలేదు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, రవీంద్రన్ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆదివారం రాత్రి ఆయన కుటుంబం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒమర్ అబ్దుల్లా భార్యకు సుప్రీం నోటీసులు

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సుప్రీంకోర్టులో వేసిన విడాకుల పిటిషన్‌పై ఆయన సతీమణికి నోటీసులు అందాయి. ఆరు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. తన భార్య నుంచి విడాకులు ఇప్పించాలని అభ్యర్థిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను గతంలో దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఒమర్ విజ్ఞప్తిలో ఎలాంటి అర్హత లేదని స్పష్టం చేసింది. అబ్దుల్లాకు విడాకులు మంజూరుచేసేందుకు నిరాకరిస్తూ 2016లో కుటుంబ న్యాయస్థానం వెలువరించిన ఆదేశాన్ని హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. దీంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. అబ్దుల్లా తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. వారిద్దరూ గత 15 ఏళ్లుగా విడివిడిగా ఉంటున్నారని, వారి దాంపత్యబంధం దాదాపుగా ముగిసినట్టేనని కోర్టుకు తెలిపారు. వీరి విషయంలో ఆర్టికల్ 142ను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. చక్కదిద్దలేనంతగా విఫలమైన వివాహాలను రద్దు చేసేందుకు రాజ్యాంగంలోని 142(1) అధికరణం కింద తమకు విశేషాధికారం ఉన్నట్లు గతంలో సుప్రీంకోర్టు వెల్లడించిన సంగతి తెలిసిందే.

రష్యా సైన్యానికి హాజీపూర్ బూట్లు

వైశాలి: రష్యా సైనికులు భారత్‌లో తయారయ్యే బూట్లు వేసుకుంటున్నారు. రష్యా సైనికులు ధరించే ఈ బూట్లు బీహార్‌లోని హాజీపూర్‌లో తయారవుతున్నాయి. హాజీపూర్ నగరం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రసిద్ధి. అలాంటి నగరం రష్యా సైనికులకు బూట్ల తయారు చేయడం ద్వారా హాజీపూర్ అంతర్జాతీయ ఖ్యాతీ పొందింది. హాజీపూర్‌లోని కాంపిటెన్స్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ జనరల్ మేనేజర్ సాహిబ్ కుమార్ రాయ్ మాట్లాడుతూ 2018లో ఈ సంస్థ ద్వారా బూట్ల తయారీ ప్రారంభించామని తెలిపారు. స్థానికులకు ఉద్యోగాల కల్పన కోసం ముఖ్యంగా ఈ సంస్థను ఏర్పాటు చేశామన్నారు. తొలుత ఈ బూట్లను రష్యాకు ఎగుమతి చేశామని తెలిపారు. ఈ బూట్లను ఆ దేశ వాతావరణానికి అనుగుణంగా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలను సైతం ఈ బూట్లు తట్టుకుంటాయని చెప్పారు. ఈ బూట్ల బరువు స్వల్పంగా ఉంటాయన్నారు. వీటిని ధరించడం వల్ల జారి పడే అవకాశం ఉండదన్నారు. ఈ బూట్లకు వాడే సోల్ సైతం ప్రత్యేకత కలిగి ఉంటుందన్నారు. ఈ బూట్లకు రష్యాలో మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. రష్యాకు అత్యధికంగా బూట్లు ఎగుమతి చేస్తున్న సంస్థల్లో కాంపిటెన్స్ ఎక్స్‌పోర్ట్స్ ఒకటని సాహిబ్ కుమార్ స్పష్టం చేశారు. కాంపిటెన్స్ ఎక్స్‌పోర్ట్స్... బీహార్‌లో ప్రపంచ స్థాయి సంస్థగా ఖ్యాతి కెక్కిందన్నారు. తమ సంస్థలో 300 మంది ఉద్యోగులు ఉంటే... వారిలో 70 శాతం మంది మహిళలేనన్నారు. గతేడాది రూ.100 కోట్ల విలువైన 1.5 మిలియన్ల జతల బూట్లు ఎగుమతి చేశామన్నారు. వచ్చే ఏడాది దీనిని 50 శాతం మేర పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు బీహార్ ప్రభుత్వం ప్రచారంతోపాటు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. మరిన్ని మౌలిక సదుపాయాలు రహదారులతోపాటు సమాచార వ్యవస్థను మెరుగు పరిస్తే... రష్యాలోని వ్యాపారస్తులు హాజీపూర్ వైపు దృష్టి సారిస్తారని సాహిబ్ కుమార్ తెలిపారు.

కర్నాటక అసెంబ్లీలో ఏఐ కెమెరాలు

బెంగళూరు: అసెంబ్లీ సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధుల హాజరును పర్యవేక్షించేందుకు కర్నాటక విధాన సౌధ కీలక చర్యలు చేపట్టింది. ఇందుకోసం అసెంబ్లీలో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో కూడిన 'ఏఐ' కెమెరాలు ఏర్పాటు చేసింది. చట్టసభ సభ్యుల రాకపోకలతోపాటు వారు సభలో ఉన్న వ్యవధిని నమోదు చేసేందుకు ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. సమావేశాల్లో సభ్యుల హాజరు, సభలో వారి భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఈ విధానాన్ని తీసుకువచ్చామని అధికారులు పేర్కొన్నారు. 'కోరం బెల్ మోగకముందే అసెంబ్లీలోకి వచ్చే ఎమ్మెల్యేలను గుర్తించి, వారి పేర్లను చదివి ప్రశంసించే సంప్రదాయం ఉంది. కొందరు సీనియర్ సభ్యులు ఆలస్యంగా వచ్చినప్పటికీ సాయంత్రం ఎక్కువ సమయం సభలోనే ఉంటుంటారు. అలాంటి వారిని గుర్తించకపోవడం అన్యాయంగా భావిస్తున్నాం. ఈ క్రమంలో సభలోకి రావడం, నిష్క్రమణ సమయాన్ని నమోదు చేసేందుకు కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు ఏర్పాటు చేశాం' అని స్పీకర్ యూటీ ఖాదర్ పేర్కొన్నారు. ఈ విధానం తీసుకురావడంతో చొరవ చూపిన స్పీకర్‌ను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, విపక్ష నేత ఆర్ అశోకతోపాటు ఇతర చట్టసభ సభ్యులు అభినందించారు.

బీజేపీ చౌకబారు రాజకీయాలు: కాంగ్రెస్

న్యూదిల్లీ: నేతల భద్రత విషయంలో చౌకబారు రాజకీయాలు చేయరాదని బీజేపీపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ప్రధాని నరేంద్ర మోదీపై ఎన్నికల్లో మూడుసార్లు విఫలమైన రాహుల్ గాంధీ హింసను ప్రోత్సహిస్తున్నారని బీజేపీ ఐటీ విభాగాధిపతి అమిత్ మాల్వియా చేసిన విమర్శలను కాంగ్రెస్ మీడియా విభాగాధిపతి పవన్‌ఖేరా దీటుగా తిప్పికొట్టారు. 'నేతల భద్రత విషయంలో చౌకబారు రాజకీయాలు చేయకూడదు. కాంగ్రెస్ పార్టీ మితవాద టెర్రరిస్టుల చేతిలో మహాత్మాగాంధీని కోల్పోయింది. ఉగ్రవాదుల చేతిలో ఇద్దరు ప్రధానులను కోల్పోయాం. బీజేపీ ప్రభుత్వ పర్యవేక్షణలో మావోయిస్టుల చేతిలో చత్తీస్‌గఢ్‌లో మొత్తం మా నాయకత్వాన్ని కోల్పోయాం. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ సహా కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా అబద్ధాలు వ్యాప్తి చేయడం ద్వారా ప్రధాని మోదీతో పాటు బీజేపీ ప్రజలను రెచ్చగొడుతున్నారు' అని ఖేరా విమర్శించారు.

హోదా డిమాండ్‌పై నితీశ్ ఏం చేస్తున్నారు?

జైరామ్ రమేశ్

న్యూదిల్లీ: రాష్ట్రానికి ప్రత్యేక కేటగిరీ హోదా డిమాండ్‌పై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ కార్యాచరణ ఏమిటో వెల్లడించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. బీహార్‌లోని సీనియర్ మంత్రులు ఇప్పుడు నీతి ఆయోగ్ తాజా విశ్లేషణ రాష్ట్రానికి కేంద్ర సహాయం విషయంలో ప్రత్యేక కేటగిరీ హోదా కావాలన్న తమ డిమాండ్‌ను సమర్థిస్తోందని వాదిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్' వేదికగా సీఎం నితీశ్‌కు ప్రశ్నలు సంధించారు. ప్రత్యేక హోదా డిమాండ్‌పై బీహార్ సీఎం ప్రెస్ స్టేట్‌మెంట్లు ఇవ్వడం, తీర్మానాలు చేయడం మినహాయించి అదనంగా ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర వహించిన నితీశ్ హోదా సాధించగల స్థితిలో ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ప్రత్యేక హోదా డిమాండ్ సాధించుకునే స్థితిలో ఉన్నారని తెలిపారు. నీతి ఆయోగ్ తాజా ఇండెక్స్‌పై జేడీయూ సీనియర్ నాయకుడు, బీహార్ జలవనరుల శాఖ మంత్రి విజయ్ కుమార్ చౌదరి మాట్లాడుతూ... "ఆయోగ్ తాజా నివేదిక కేంద్రం నుంచి అతిపెద్ద ఆర్థిక సహాయం కోసం మా దీర్ఘకాల డిమాండ్‌ను సమర్థించింది" అని అన్నారు. 'కేంద్రం నుండి ప్రత్యేక ఆర్థిక సహాయం అవసరమైన అత్యంత అర్హత కలిగిన రాష్ట్రం బీహార్. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో బీహార్ ఒకటి. బీహార్ స్థిరంగా అభివృద్ధి చెందడమే కాకుండా అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాలను కూడా అధిగమించింది' అని చౌదరి చెప్పారు. ఇదే అభిప్రాయాన్ని బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, జేడీ(యూ) నేత శ్రవణ్ కుమార్ వ్యక్తీకరించారు. "కేంద్ర ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజీ లేదా ప్రత్యేక హెూదాను ప్రకటించాలి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం బీహార్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

ప్రధాని మోదీతో సోరెన్ భేటీ

న్యూదిల్లీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. జైలు నుంచి విడుదలై...బయటికి వచ్చి...సీఎం పదవి చేపట్టాక ప్రధానితో జరిగిన తొలి సమావేశం ఇది. ఈ ఏడాది చివర్లో జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా మోదీని సోరెన్ కలవడం చర్చనీయాంశమైంది. మోదీతో సమావేశానికి సంబంధించిన ఫొటోలను సోరెన్ ఎక్స్‌లో షేర్ చేస్తూ మర్యాదపూర్వక భేటీ అని తెలిపారు. ఆదివారం ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని కూడా సోరెన్ కలిశారు. భూ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో సోరెన్‌ను ఈడీ అరెస్ట్ చేయగా జూన్ 29న జార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. కాగా, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్‌కి రెండు నెలల ముందే అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. హర్యానా, మహారాష్ట్రకు అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నవీకరణ, సవరణ ప్రక్రియ ఒకే షెడ్యూల్‌లో కొనసాగుతుండగా, జార్ఖండ్‌లో కూడా అదే షెడ్యూల్‌ను అనుసరిస్తున్నారు. ఇప్పటికే భారత ఎన్నికల సంఘం బృందం జులై 10, 11 తేదీల్లో జార్ఖండ్‌లో పర్యటించింది. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితేశ్ వ్యాస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రవి కుమార్... 24 జిల్లాల ఎన్నికల అధికారులతో ఓటరు జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల సన్నాహాలపై సమీక్ష నిర్వహించారు

పవార్‌తో సమస్యల పరిష్కారం

త్వరలో సీఎం షిండే సహా ముఖ్యులతో చర్చలు: ఛగన్ భుజ్‌బల్

మరాఠా కోటా... ఓబీసీల నిరసనపై చర్చలు

ముంబై: మహారాష్ట్ర మంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ అనుచరుడు ఛగన్ భుజ్‌బల్... ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌ను సోమవారం కలిశారు. ఆయన నివాసానికి వెళ్లిన భుజ్‌బల్ మరాఠా కోటా, ఓబీసీ నిరసనలపై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని శరద్ పవార్‌ను కోరారు. అనంతరం మంత్రి ఛగన్ భుజ్‌బల్ మీడియాతో మాట్లాడారు. శరద్ పవార్‌తో దాదాపు గంటన్నర సేపు సమావేశమైనట్లు తెలిపారు. మరాఠా కోటా, ఓబీసీ నిరసనల నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పరిస్థితులు చాలా ఉద్రిక్తంగా ఉన్నాయన్నారు. కాగా, శరద్ పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని ఓబీసీల సమస్యలను పరిష్కరించారని ఛగన్ భుజ్‌బల్ తెలిపారు. అందుకే ఇప్పుడు ఆయన జోక్యాన్ని కోరినట్లు చెప్పారు. సీఎం ఏక్‌నాథ్ షిండే, రాష్ట్రంలోని ఇతర ముఖ్య నేతలతో చర్చించడానికి ఆయన అంగీకరించారని అన్నారు. ఆయనకు ఆరోగ్యం బాగోలేదు కాబట్టి కోలుకోవడానికి రెండు రోజులు అవసరమని చెప్పారన్నారు. 'రాష్ట్రంలో, ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉన్నందున, ఈ విషయాన్ని పరిశీలించాలని నేను శరద్ పవార్‌ను అభ్యర్థించాను. మరాఠాలు, ఓబీసీల మధ్య దూరం ఎంత స్థాయికి చేరుకుందంటే, వారు ఆహారం కోసం ఒకరి హెూటళ్లకు ఒకరు వెళ్లడం లేదు' అని ఆయన పేర్కొన్నారు. 'పవార్ చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, రాష్ట్రంలోని ఇతర ముఖ్యమైన నాయకులతో చర్చించి సమస్యను చర్చించడానికి అంగీకరించారు' అని భుజ్‌బల్ తెలిపారు. ఓబీసీ కేటగిరీ కింద మరాఠా కోటాను ఓబీసీ నాయకుడైన భుజ్‌బల్ కూడా వ్యతిరేకిస్తున్నారు. పవార్ మహారాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు, స్థానికసంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించిన విషయాన్ని భుజబల్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని ఓబీసీల సమస్యలను పరిష్కరించారు. ఇప్పుడు పరిస్థితి మళ్లీ ఆయన జోక్యాన్ని కోరుతోంది. పవార్ తన ఆరోగ్యం బాగోలేనందున రెండు రోజులు సమయం కావాలని కూడా నాతో చెప్పారు' అని భుజ్‌బల్ తెలిపారు. శరద్ పవార్ నివాసానికి వెళ్లినతర్వాత ఆయనను కలవడానికి దాదాపు గంటన్నర సేపు వేచి ఉండాల్సి వచ్చిందని మంత్రి చెప్పారు. 'పవార్‌కు ఆరోగ్యం బాగాలేదు కాబట్టి విశ్రాంతి తీసుకుంటున్నారు. మేము ఆయన పడకగదిలో చర్చించాము' అని వెల్లడించారు. మరోవైపు శరద్ పవార్‌ను ఛగన్ భుజ్‌బల్ కలవడం ఎన్సీపీలో తీవ్ర చర్చకు దారి తీసింది. సీనియర్ నేత అయిన ఆయన అజిత్ పవార్ ఎన్సీపీలో ఇమడలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తిరిగి శరద్ పవార్ వర్గంలో చేరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. అంతకుముందు, శరద్ పవార్‌ను భుజబల్ కలవడం పై రాష్ట్ర మంత్రి, బిజెపి నాయకుడు సుధీర్ ముంగంటివార్ మాట్లాడుతూ... రాజకీయ నాయకులు తమ సైద్ధాంతిక విభేదాలతో పక్కనబెట్టి ఒకరితో ఒకరు చర్చలు జరపడం మహారాష్ట్రలో ఆనవాయితేనని చెప్పుకొచ్చారు. ఎన్సిపి (ఎస్పి) నాయకుడు జితేంద్ర అవద్ మాట్లాడుతూ... ప్రజా జీవితంలో కూడా భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉన్న వ్యక్తులకు శరద్ పవార్ సమయం కేటాయించడం అతని దాతృత్వానికి అద్దం పడుతోందన్నారు. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ప్రత్యర్థి ఎన్సీపీకి చెందిన ఓబీసీ నాయకుడు భుజబల్. మరాఠా కోటా అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించినందుకు శరద్‌పవార్‌పై భుజ్‌బల్ విమర్శలు గుప్పించిన సంగతి విదితమే.మరాఠా రిజర్వేషన్ అంశంపై ప్రతిపక్షాన్ని విశ్వాసంలోకి తీసుకోలేదని పేర్కొంటూ జులై 9న సీఎం షిండే ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)తో కూడిన మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) నేతలు హాజరుకాలేదు. కాగా బారామతి (శరద్‌పవార్) నుండి ఫోన్ కాల్ వచ్చిన తర్వాతే ప్రతిపక్ష నాయకులు ఈ సమావేశానికి దూరంగా ఉన్నారని భుజ్‌బల్ ఆదివారం పేర్కొన్నారు. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కేటగిరీ కింద మరాఠా కమ్యూనిటీకి రిజర్వేషన్ కల్పించాలని ఉద్యమకారుడు మనోజ్ జరంగే డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో తమ కోటాను ప్రభావితం చేయబోమని హామీ ఇవ్వాలని కోరుతూ కొందరు ఓబీసీ కార్యకర్తలు ఇటీవల ఆందోళన నిర్వహించారు.

తీహార్ జైలులో 1,402 రోజులు

- ఉమర్ ఖాలిద్‌కు న్యాయం ప్రశ్నార్థకం
- బెయిల్ ఇవ్వని కోర్టులు
- విచారణ లేకుండా జైలులోనే జేఎన్‌యూ మేధావి

న్యూదిల్లీ: జేఎన్‌యూ మేధావి ఉమర్ ఖాలిద్‌కు న్యాయమెప్పుడన్నది ప్రశ్నార్థకమైంది. ఆయన కనీసం విచారణకు నోచుకోకుండా 1,402 రోజులుగా తీహార్ జైల్లో మగ్గుతున్నారు. జేఎన్‌యూ విద్యార్థి నాయకులు కన్హయ కుమార్, షెహ్లా రషీద్‌తో పాటు ఉమర్ ఖాలిద్ గురించి ప్రపంచానికి తెలిసింది. ఈ ఎనిమిదేళ్లలో సహచరులు రాజకీయాల్లోకి రాణించగా ఉమర్ మాత్రం ఊచలు లెక్కపెడుతూ ఉండిపోయారు. ఫోయొడర్ దోస్తోవెస్కీ రచించిన 'ది బ్రదర్స్ కరమాజోవ్', మనోజ్ మిట్టల్ రచన 'క్యాస్ట్ ప్రైడ్: బ్యాటిల్స్ ఆఫ్ ఈక్వాలిటీ ఇన్ హిందూ ఇండియా' పుస్తకాలను ఉమర్ ప్రస్తుతం చదువుతున్నారని గత వారం ఆయనను జైల్లో కలిసి మిత్రులు బనోజ్యోత్స్నా లాహిరి తెలిపారు. ఉమర్ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, న్యాయం అనేది దరిదాపుల్లో లేదన్నారు. ఫిక్షన్-నాన్ ఫిక్షన్‌ను కలిపి చదివే అలావాటు ఉమర్‌కు ఉన్నదన్నారు. 2020 సెప్టెంబరులో ఉమర్‌ను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీ అల్లర్ల సూత్రధారిగా ఆరోపించారు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా దిల్లీలోని షహీన్‌బాగ్ నిరసనకారుల్లో అరెస్టుకు గురైన 20 మందిలో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ ఉన్నారు. ఉమర్‌పై రెండు కేసులు నమోదు కాగా అందులో ఒకటి కొట్టివేశారు. మరొక కేసులో చార్జిషీటు కూడా దాఖలు కాలేదు. కింది స్థాయి నుంచి ఉన్నతస్థాయి న్యాయస్థానాలు వరకు ఎక్కడా ఉమర్‌కు బెయిల్ లభించలేదు. ఉమర్‌పై 'ఉపా' కేసు కూడా ఉంది. ఇప్పటివరకు ఆయనపై కేసుల్లో విచారణ మొదలు కాలేదు. ఉమర్ జేఎన్‌యూ నుంచి పీహెచ్‌డీ కాగా తొలుత ఆయన థీసిస్‌ను విశ్వవిద్యాలయం అంగీకరించలేదు. 2018లో కోర్టులు చీవాట్లు పెట్టిన తర్వాత ఈ విషయంలో ఆయనకు ఊరట లభించింది. 2016, ఫిబ్రవరి 9న జరిగిన ఘటనల విచారణ క్రమంలో జేఎన్‌యూ అధికారులు నియమించిన ప్యానల్... ఉమర్‌ను రస్టిగేట్ చేసింది. ఆ తర్వాతే కన్హయ కుమార్‌తో పాటు ఉమర్ ఖాలిద్ అందరి దృష్టిని ఆకర్షించగలిగారు. తనపై కఠిన చర్యలు తీసుకోవద్దన్న కోర్టు ఆదేశాలను జేఎన్‌యూ అధికారులు ధిక్కరించినట్లు ఉమర్ అప్పట్లో ఆరోపించారు. పీహెచ్‌డీ కోసం అందజేసిన పత్రాలను 2018, ఆగస్టు 2న వర్సిటీ తీసుకుంది. జీవితంలో వరుస కష్టాలు ఎదురైనప్పటికీ ఉమర్ ఖాలిద్ మనో ధైర్యాన్ని కోల్పోలేదని లాహిరి వెల్లడించారు. 'జైలు అనేది మంచి ప్రదేశం కాదు. అక్కడ ఎవరూ ఉండకూడదు. మిగతా జైళ్లతో పోల్చితే తీహార్ నిర్వహణ కాస్త మెరుగ్గా ఉంటుంది కానీ ఇక్కడి గార్డులు దురుసుగా

వ్యవహరిస్తారు' అని లాహిరి చెప్పారు. ఉమర్ 2021 జులైలో బెయిల్ కోసం సెషన్స్ కోర్టులో మొదటిసారి దరఖాస్తు చేశారు. దీనిపై విచారణ జరిగిన ఎనిమిది నెలలకు అంటే 2022, మార్చి 24న బెయిల్ ఇచ్చేందుకు సెషన్స్ కోర్టు నిరాకరించింది. సర్వోన్నత న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్‌పై విచారణ 14సార్లు వాయిదా పడింది. సెషన్స్ కోర్టు రెండు సార్లు, దిల్లీ హైకోర్టు ఒకసారి బెయిల్ పిటిషన్లను తిరస్కరించాయి. 'ప్రస్తుతానికి ఏ విషయంలోనూ స్పష్టత లేదని, హైకోర్టుకు వెళ్లాలని భావిస్తున్నామని లాహిరి చెప్పారు. హైకోర్టుకు వెళ్లే ముందు కేసును విచారించే ధర్మాసనం గురించి తెలుసుకోవాల్సి ఉందని, గతంలో విచారించిన జడ్జిలు బదిలీ అయ్యారన్నారు. ఈ కేసులో 20 మంది నిందితులలో ఆరుగురికి బెయిల్ లభించింది. మిగతా 14 మంది జైళ్లలో ఉన్నారు. కొందరు ఇప్పటికే వేర్వేరు బెంచీల ఎదుట వాదనలు వినిపించినప్పటికీ ఇప్పుడు మళ్లీ కొత్తగా వాదనలు వినిపించాల్సి వస్తుందని లాహిరి అన్నారు. ఈ వరుసలో తాము ఎక్కడున్నది తెలియదన్నారు. స్పష్టత లభిస్తే తగు విధంగా ముందుకు వెళతామని చెప్పారు. ఉమర్ ఖాలిద్ నిర్బంధానికి కారణం మత స్వేచ్ఛ కోసం ఆందోళన చేయడమేనని అంతర్జాతీయ మతస్వేచ్ఛపై అమెరికా కమిషన్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) పేర్కొనగా... భారత ప్రభుత్వం దీనిని తిరస్కరించింది. 2022, అక్టోబరులో ఉమర్ ఖాలిద్‌పై ఉపా కేసును సుప్రీంకోర్టు మాజీ జడ్జి, హైకోర్టుకు చెందిన ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పరిశీలించారు. ఉమర్‌పై ఉగ్రవాదిగా ముద్రవేసేందుకు ఆధారాలు వారికి లభించలేదు. ఉమర్ జైల్లో 1400 రోజులు పూర్తి చేసేందుకు రెండు నెలల కిందట కర్నాటకలో సీరియల్ లైంగిక వేధింపుల కేసులో జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణకు రూ.5లక్షల పూచీకత్తుపై బెంగళూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఉమర్ ఖాలిద్‌కు బెయిల్ లభించని పరిస్థితి శోచనీయమే!

బకాయిల విడుదలకు కృషి

జౌళి పరిశ్రమ ప్రతినిధులకు మంత్రి సవిత హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జౌళి పరిశ్రమకు గత ప్రభుత్వం నుండి రావలసిన బకాయిల విడుదల చేయించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని టెక్స్‌టైల్స్, స్పిన్నింగ్, జిన్నింగ్ పరిశ్రమల ప్రతినిధులతో సచివాలయంలో మంత్రి సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. జౌళి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను అయా ప్రతినిధులు మంత్రి సవిత దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ గత ప్రభుత్వాల నుండి రావలసిన రూ.1400 కోట్లను వెంటనే విడుదల చేయించాలని, గతంలో మాదిరి ప్రత్యేక జౌళి పాలసీ తీసుకురావాలని, స్థానిక కార్మికులకు 75 శాతం ఉపాధి కల్పన నిబంధన సడలించాలని, జీవో 21 రద్దు చేయాలని కోరారు. ప్రత్తిపై దిగుమతి సుంకం తగ్గించాలని, తమ సంస్థల ద్వారా ఉత్పత్తి అయ్యే మిగులు విద్యుత్‌ను తిరిగి తమ అవసరాలకు వినియోగించుకునేలా విధాన రూపకల్పన జరగాలని విన్నవించారు. దీనిపై మంత్రి సవిత సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు చేనేత జౌళి శాఖను పునరుజ్జీవింప చేయటానికి కట్టుబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో అన్ని వ్యవస్థలను భూస్థాపితం చేసిందని, ఈ పరిస్థితి నుండి రాష్ట్రాన్ని బయటకు తీసుకువచ్చేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. జౌళి పరిశ్రమ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరింప చేస్తామని వివరించారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె. సునీత, శాఖ ఇన్చార్జి కమిషనర్ శ్రీకాంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు

ఏపీయూడబ్ల్యూజే నేతలకు హిమాన్షు శుక్లా హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ ఇవ్వడానికి కృషి చేస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా అన్నారు. ఇందుకోసం నిబంధనలను సరళీకరిస్తామన్నారు. పౌర సంబంధాల శాఖ సంచాలకునిగా బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుశీక్లాను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర నాయకత్వ బృందం సోమవారం కలిసి అభినందించింది. శుక్లాను పుష్పగుచ్ఛం, శాలువాతో ఏపీయూడబ్ల్యూజే నాయకులు సత్కరించారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై 15 అంశాల వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ జీవోను రద్దు చేయాలని, నిబంధనలు సరళతరం చేసి వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలని కోరారు. హిమాన్షు శుక్లా సానుకూలంగా స్పందించారు. అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్లు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. 2019 మార్చి నాటికి హెల్త్‌కార్డులున్న జర్నలిస్టులందరికీ ప్రస్తుత హెల్త్ స్కీములో అవకాశం కల్పించాలని, నెట్‌వర్క్ ఆస్పత్రులలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి త్రైపాక్షిక కమిటీ ఏర్పాటు చేయాలని నేతలు కోరారు. జర్నలిస్టు ప్రమాద బీమాను పునరుద్ధరించాలన్నారు. పాత్రికేయుల సమస్యలపై పూర్తిగా అధ్యయనం చేసి పరిష్కారాలపై దృష్టి పెడతామని శుక్లా హామీఇచ్చారు. అరగంట సేపు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధానకార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, విజయవాడ అర్బన్ శాఖ కార్యదర్శి దారం వేంకటేశ్వర రావు పాల్గొన్నారు. అనంతరం జనసేన కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్‌కు వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు. పవన్ కళ్యాణ్‌తో భేటీకి త్వరలో ఏర్పాటు చేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకరిస్తానని హరిప్రసాద్ హామీ ఇచ్చారు.

కార్మిక హక్కుల రక్షణకు పోరాటం

ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక హక్కుల రక్షణకోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందని ఆంధ్రప్రదేశ్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం ప్రారంభమైన రెండురోజుల ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశం (జులై 15, 16)లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కాలంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వారి వేతనాల పెంపు కోసం 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా జులై నుండి వేతనాలు పెంచుతామని ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తామని గట్టిగా చెప్పటం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం మారిన పరిస్థితులలో వారి వేతనాలు పెరగలేదని... దీనిపై ప్రస్తుత ప్రభుత్వం సానుకూల స్పందించాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్మికులు 14 రోజులు సమ్మె సాగించి విజయం సాధించారని... హమాలీ కార్మికులు వారి సమస్యలపై, కూలి రేట్ల పెంపుపై నిరంతరం పోరాడుతున్నారని చెప్పారు. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన తర్వాత చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని, పాఠశాలల ఆయాలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు మొదలగు వర్గాలను ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఓబులేసు పేర్కొన్నారు. ఆయా వర్గాల వారికి ఏఐటీయూసీ అండగా నిలబడుతుందన్నారు. ఈ నెలలో నూజివీడులో రెండు రోజులపాటు ఏఐటీయూసీలో పనిచేస్తున్న యువ కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈనెల 24, 25 తేదీలలో మున్సిపల్ కార్మికులకు మదనపల్లెలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆగస్టు 10, 11 తేదీలలో స్కీమ్ కార్మికులకు కడప జిల్లా పొద్దుటూరులో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ముఖ్యంగా సెప్టెంబర్‌లో ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తామని ఓబులేసు వివరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, కోశాధికారి కొండలరావు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కిరాతకం

విశాలాంధ్ర-లింగపాలెం: కుటుంబ కలహాలతో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కిరాతకంగా వ్యవహరించాడు. తన మరదలి రెండు నెలల బిడ్డను గొంతు నులిపి చంపేశాడు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా లింగపాలంలోని పాచ్చా నగరంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కౌవగుంటకు చెందిన బాలాజీకి పాచ్చా నగరానికి చెందిన ఎంట్రపాటి దివ్యతో వివాహం జరిగింది. ఇద్దరు తరచూ గొడవ పడటంతో విడాకుల కోసం కోర్టుకెళ్లారు. వాయిదాల నిమిత్తం ఏలూరు కోర్టుకు వెళ్లిన క్రమంలో కానిస్టేబుల్ భర్త... తన భార్యను, మామను కోర్టు ఆవరణలోనే కొట్టాడు. అక్కడ నుంచి నేరగా పాచ్చా నగరానికి వెళ్లి అత్త జయమ్మను, బాలింతగా ఉన్న మరదలు చంద్రను చితకబాదాడు. చంద్ర రెండు నెలల కుమారుడిని గొంతు నులిపి చంపేశాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ధర్మాజీగూడెం ఎస్సై చెన్నారావు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి ఆరా తీశారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కిరాతకుడిని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సీఐ సుధాకర్ ఘటన వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇలాంటి ఘటన జరగడం మొదటిసారి కావడంతో స్థానికులు తల్లడిల్లిపోయారు. పుట్టిన బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు.

బండరాళ్ల మధ్య తెల్లారిన బతుకులు

- దొనబండ క్వారీలో రాళ్లమీద పడి ముగ్గురి మృతి
- పెద్దబండలకు రంధ్రాలు పెడుతుండగా ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబాలు

విశాలాంధ్ర-కంచికచర్ల: బతుకుదెరువు కోసం రాష్ట్రం కాని రాష్ట్రం వచ్చిన శ్రమజీవులను బండరాళ్లు పొట్టన పెట్టుకున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకువచ్చిన కార్మికుల జీవితాలు బండరాళ్ల మధ్యనే తెల్లారిపోయాయి. డ్రిల్లింగ్ చేస్తుండగా పెద్ద మొత్తంలో బండరాళ్లు జారి పడటంతో ముగ్గురు క్వారీ కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. పెద్దపెద్ద బండరాళ్ల కింద మృతదేహాలు ఛిద్రమయ్యాయి. బండరాళ్ల గుట్టలో చిక్కుకుపోయాయి. పొట్ట కూటి కోసం వచ్చి కూలినాలి చేసుకునే కష్టజీవులు క్వారీలో దుర్మరణం చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. వివరాలు ఇవి. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని దొనబండ పవన్ క్రషర్‌కు చెందిన క్వారీలో సోమవారం ఉదయం పెనుప్రమాదం చోటుచేసుకుంది. బ్లాస్టింగ్ పూర్తయిన అనంతరం పెద్దపెద్ద బండల స్లాబులను చిన్నవిగా చేసి బ్లాస్ట్ చేసేందుకు ఉదయాన్నే క్వారీకి చేరుకున్న నలుగురు కార్మికులు రంధ్రాలు పెడుతున్నారు. జి.కొండూరు మండలం చెరువు మాధవరంనకు చెందిన డ్రిల్లింగ్ యజమాని బత్తుల దుర్గారావు (23), జి. కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో నివాసం ఉంటున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన డ్రిల్లర్ బీబీ నాయక్ (42), చెవుటూరులో నివాసం ఉంటున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామ్ దేవ్ భాగేల్ (33) బండరాళ్లకు రంధ్రాలు పెడుతున్నారు. అప్పటికే బ్లాస్టింగ్‌కు కదిలి లూజుగా ఉన్న పెద్దపెద్ద బండ రాళ్లన్నీ ఒక్కసారిగా జారి కొండ పైనుంచి కిందికి పడిపోయాయి. దీంతో బండ రాళ్లకు రంధ్రాలు పెడుతున్న ముగ్గురు కార్మికులు కూడా పైనుంచి కిందకు జారి పడిపోయారు. దుర్గారావు, బీబీ నాయక్, రామ్ దేవ్ బాహేల్ బండరాళ్ల కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరితోపాటే ఒడిశాకు చెందిన కోమార గోలి అనే వ్యక్తి ఆ ప్రాంతానికి దూరంగా ఉండటంతో అతడు క్షేమంగా బయటపడ్డాడుసమాచారం అందుకున్న కంచికచర్ల పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్వారీ యజమానుల సహకారంతో బండరాళ్ల గుట్టలలో చిక్కుకుపోయిన మృతదేహాలను ఎక్స్‌కవేటర్లతో వెలికితీసే పనిలో నిమగ్నమయ్యారు. గత కొద్దిరోజులుగా నిరంతరాయంగా వర్షాలు కురుస్తుండడం, అంతకు ముందుగానే బ్లాస్టింగ్ జరగడంతో కదిలిపోయిన బండరాళ్లన్నీ ఒకేసారి జారి కింద పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని నందిగామ ఏసీపీ డాక్టర్ బి. రవి కిరణ్, గ్రామీణ సీఐ పీ చంద్రశేఖర రావు, ఎస్ఐ

సుబ్రహ్మణ్యం, ఎస్సై- 2 హైమావతి సందర్శించారు. ఎట్టకేలకు సాయంత్రం ఐదు గంటల సమయంలో మృతదేహాలను రాళ్లగుట్ట నుంచి బయటకు తీశారు. నందిగామ ఆర్డీవో ఏ రవీంద్రరావు, కంచికచర్ల తహసీల్దార్ సుస్వాగతం, మైనింగ్ ఏడి, ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించారు. మృతి చెందిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించే విషయంపై యజమానితో అధికారులు, మృతుల బంధువులు సంప్రదింపులు జరుపుతున్నారు. కాగా క్వారీ కార్మికులకు, బ్లాస్టింగ్ హోల్స్ వేసే డ్రిల్లింగ్ కార్మికులకు సరైన రక్షణ సౌకర్యాలు కల్పించకపోవడం వల్లే నిత్యం క్వారీలలో ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

'కోడికత్తి' శ్రీనుకు సుప్రీంలో ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో దుమారం రేపిన కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. శ్రీను (జనిపల్లి శ్రీనివాసరావు)కు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఎన్ఐఏ అధికారులు సుప్రీంకెళ్లారు. ఈ పిటిషన్‌ను సోమవారం విచారించిన సర్వోన్నత న్యాయస్థానం దానిని కొట్టివేసింది. 2019 ఎన్నికలకు ముందు విశాఖపట్నం విమానాశ్రయంలో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కోడికత్తితో దాడి చేసిన కేసులో శ్రీను ఐదేళ్లపాటు జైల్లో ఉన్నారు. ఈ కేసులో జగన్‌మోహన్ రెడ్డి కోర్టుకు హాజరు కాకుండా, లోతైన దర్యాప్తు కోరుతూ కాలయాపన చేస్తున్న నేపథ్యంలో నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.